పట్టణాల్లో ట్రాఫిక్ మార్గాలు దాటుకుని జాతీయ రహదారి ఎక్కగానే ఎక్సలేటర్‌పై ఒత్తిడి పెరిగిపోతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు లేకపోవడంతో రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. పైగా ఆరు వరుసల జాతీయ రహదారి కావడంతో వేగానికి కళ్లెం వేయడంలేదు. ఇలాంటి



కంటైనర్ కింద ఇరుక్కున్న కారును కొంత దూరం వరకు లాక్కెళ్ళిన దృశ్యం



సంఘటనా స్థలం వద్ద ఐదుగురి మృతదేహాలు

# విషాద యాత్ర

## హరి హరులను దర్శించుకుని.. వెళుతుండగా ఘోర రోడ్డు ప్రమాదం

- పాకాల సమీపంలో కంటైనర్ కిందకు దూసుకెళ్లిన కారు
- ఐదుగురి దుర్మరణం, ఇద్దరికి తీవ్రగాయాలు

అతివేగం వల్ల ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్నారు.

- తిరుపతి/పాకాల, ఆంధ్రజ్యోతి





రుయా ఎమర్జెన్సీ నుంచి గీతమ్మను స్విమ్స్‌కు తరలిస్తున్న వైద్య సిబ్బంది, చికిత్స పొందుతున్న క్రిస్‌విల్

బెంగళూరుకు చెందిన నలుగురు మహిళలు తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరులోని జీఆర్‌బీ ఫుడ్ ప్రొడెక్ట్స్‌లో పనిచేస్తున్నారు. వీరు శనివారం తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. తిరుగుప్రయాణంలో పాకాల సమీపంలోని తోటపల్లి వద్ద జార్ఖండ్ రాష్ట్రం రాంచీనుంచి బెంగళూరుకు కొరియర్ లోడ్‌తో వెళ్తున్న కంటైనర్‌ను వెనుక వైపు బలంగా ఢీ కొన్నారు. దీంతో కారు కంటైనర్ కిందకు దూసుకెళ్లింది. ఏదో యాక్సిడెంట్ జరిగిందని గ్రహించిన లారీ డ్రైవర్ ఎన్‌హెచ్‌కు ఓవైపున లారీ నిలిపారు. అప్పటికే సుమారు 80 మీటర్లు కంటైనర్ ప్రయాణం చేసింది. ఇంతలో స్థానికులు, అటువైపు వెళ్లేవారు అప్రమత్తమై పోలీసులకు, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు.అప్పటికే ఘోరం జరిగిపోయింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంటైనర్ కింద చిక్కుకున్న కారు నుజ్జునుజ్జుగా మారింది. అతికష్టం మీద బయటకు తీశారు. ఈఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చనిపోయినవారి కొందరి ముఖాలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. జాతీయ రహదారుల కోసం వినియోగించే క్రేన్ తీసుకొచ్చి అతికష్టం మీద కంటైనర్ నుంచి కారును వేరుచేశారు. గాయపడినవారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. భీతావహంగా మారిన ఘోర ప్రమాదాన్ని చూసిన స్థానికులు తీవ్ర ఆవేదన చెందారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించారు. కంటైనర్ డ్రైవరుతో మాట్లాడారు. ప్రమాదం ఎలా జరిగిందనేది తెలుసుకున్నారు. కలెక్టర్ స్విమ్స్‌కు వెళ్లి క్షతగాత్రులకు వైద్య సేవలను పరిశీలించారు.

**మృతులు** బెంగళూరుకు చెందిన విజయలక్ష్మి (50), సహన (34), రజని (27), లేఖన్ గౌడ (10), తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన కారు డ్రైవరు ఎస్.త్యాగరాజన్ (42). వీరిలో విజయలక్ష్మి, రజని, లేఖన గౌడ్ ఒకే కుటుంబానికి చెందిన వారు.

**తీవ్రంగా గాయపడింది**

గీతమ్మ (51), క్రిస్‌విల్ (15). వీరిలో క్రిస్‌విల్ తండ్రి త్యాగరాజన్ మృతిచెందారు.



కంటైనర్ డ్రైవర్‌తో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

### రోడ్డు ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: పాకాల మండలం తోటపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కూడా రోడ్డుప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికిమెరుగైన వైద్యసేవలు అందించాలని రుయాస్పత్రి సిబ్బందికి సూచించారు.

### ఐదుగురి మృతిపై డిప్యూటీ సీఎం ఆవేదన

పాకాల, ఆంధ్రజ్యోతి: పాకాల మండలం తోటపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందడంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు. తిరుమల దర్శనం చేసుకొని తిరుగు పయనమైన భక్తులు ప్రమాదానికి గురికావడం దురదృష్టకరమన్నారు.

### కంటైనర్ కింద ఇరుక్కుపోయి..

చంద్రగిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాంచీ నుంచి బెంగళూరుకు కంటైనర్ డ్రైవర్ వికాస్ మెహతా, మరో డ్రైవర్ అభిజిత్ శనివారం బయలుదేరారు. సోమవారం మధ్యాహ్నం చంద్రగిరి మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద భోజనం చేసి, 1.30 గంటల సమయంలో కొంతదూరం వెళ్లగానే వెనక పెద్ద శబ్దం రావడంతో కంటైనర్‌కు ఏదైనా ప్రమాదం జరిగిందేమో అని సుమారు 80 మీటర్లకుపైగా ముందుకెళ్లి రోడ్డు పక్కకు వాహనం ఆపారు. కిందకు దిగి చూడగా కంటైనర్ వెనుక కింద భాగంలో కారు ఇరుక్కుపోయి ఉంది.

### గంట సమయం పట్టింది.



ప్రమాద స్థలానికి వెళ్లి చూస్తే కంటైనర్ కింద కారు ఇరుక్కుపోయి నుజ్జు నుజ్జు అయిఉంది. అప్పటికే క్రేన్ ద్వారా కారును బయటకు తీశారు. ఇద్దరికి ఊపిరి ఉండటంతో అతికష్టంపై బయటకు తీసి, ఆసుపత్రికి పంపించాము. ఆ ఇద్దర్ని తీయడానికే గంట పట్టింది.

- చంద్రశేఖర్‌రెడ్డి, తోటపల్లి

### ఇంత ప్రమాదం ఎప్పుడూ చూడలేదు



ప్రమాదం జరగ్గానే పక్కనే మా ఊరి నుంచి వెంటనే వెళ్లా. కంటైనర్ కింద కారులో నుంచి ఇద్దరి అరుపులు వినిపించాయి. అందరితో కలిసి పోలీసులకు సాయం చేసి, మృతదేహాలను బయటకు తీశాం. ఇలాంటి ప్రమాదం ఎప్పుడూ చూడలేదు.

- కిరణ్, బయనపల్లి

# డీసీసీబీ చైర్మన్‌గా మరోసారి అమాస

**వైసీపీ హయాంలో వేధింపులు...**

**గాలి భాను విజయానికి కృషి కారణం**

## డీసీసీబీ కోరిన పల్లినేనికి సీడీసీఎంఎస్‌తో న్యాయం



అమాస రాజశేఖర రెడ్డి

తిరుపతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార రంగ చరిత్రలో సుదీర్ఘకాలం డీసీసీబీ ఛైర్మన్‌గా పనిచేసిన అమాస రాజశేఖర రెడ్డిని మరోసారి ఆ పదవి వరించింది. ప్రభుత్వం సోమవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్ష పదవికి ఆయన పేరు చోటుచేసుకుంది.గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర వేధింపులు ఎదుర్కోవడం, గత ఎన్నికల్లో నగరి నుంచీ గాలి భానుప్రకాష్ విజయానికి కృషి చేయడం వంటివి ఆయనకు పదవి దక్కడానికి కారణాలయ్యాయి.

అమాస రాజశేఖర రెడ్డి 2006లో డీసీసీబీ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం జిల్లావ్యాప్తంగా ఆశ్చర్యానికి గురి చేసింది. ఆయన తండ్రి అమాస గోపాల రెడ్డి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డికి సన్నిహితుడు కావడంతో పదవి దక్కింది. 2006 నుంచీ 2011 వరకూ ఐదేళ్ళ పాటు ఛైర్మన్‌గా కొనసాగిన అమాస తర్వాత అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మద్దతుతో రెండవ పర్యాయం కూడా ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2016 వరకూ కొనసాగారు. పదవీకాలం పూర్తయ్యేనాటికి టీడీపీ ప్రభుత్వం వున్నప్పటికీ ఆయనను తొలగించకుండా 2019 వరకూ కొనసాగించింది.2017 నవంబరులో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డితో పాటు అమాస కూడా టీడీపీలో చేరారు.2017-19 నడుమ డీసీసీబీ ఛైర్మన్ హోదాలో ఆయన కుప్పం పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బ్యాంకు నిధులు విడుదల చేశారు.దీనిపై తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయనపై కేసు కూడా నమోదు చేయించింది. తర్వాత రాజకీయంగా చురుగ్గా లేకపోయినా గతేడాది ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ విజయానికి తెర వెనుక పనిచేశారు. ఈ రెండు కారణాలతో టీడీపీ అధిష్ఠానం ఆయన పట్ల సానుకూల దృక్పథంతో వుంది. దానికి తోడు సహకార రంగంలోని రెండు కీలక పదవుల్లో డీసీసీబీని రెడ్డి సామాజికవర్గానికి ఇవ్వాలని నిర్ణయించింది. నగరి,పలమనేరు,పీలేరు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్,అమరనాథరెడ్డి, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అమాస పేరును సిఫారసు చేసినట్టు తెలిసింది. ఇవన్నీ అమాసకు కలిసిరావడంతో గతంలో 13 ఏళ్ళ పాటు కొనసాగిన డీసీసీబీ ఛైర్మన్ పదవిలో ఇపుడు మళ్ళీ నియమితులయ్యారు.

### ● సీడీసీఎంఎస్ ఛైర్మన్‌గా సుబ్రమణ్యం నాయుడు



డీసీసీబీ ఛైర్మన్ పదవి ఆశించిన చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడికి ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ పదవి దక్కింది.సుదీర్ఘకాలంగా టీడీపీలో కొనసాగుతున్న ఈయన పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా వారి విజయానికి పని చేస్తున్నారు. గతంలో చంద్రగిరి మండలం ఐతేపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. ఆయన సతీమణి పనపాకం సర్పంచుగా పనిచేశారు. గత ఆరేళ్ళుగా ఆయన చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తన విజయానికి గట్టిగా కృషి చేశారన్న కారణంగా ఎమ్మెల్యే పులివర్తి నాని డీసీసీబీ పదవి ఇవ్వాలని కోరారు. అయితే సామాజిక సమీకరణల్లో భాగంగా డీసీసీబీని రెడ్డి సామాజికవర్గానికి కేటాయించామని చెప్పిన అధిష్ఠానం సీడీసీఎంఎస్ ఛైర్మన్ పదవి ఖరారు చేసింది. డీసీసీబీ, సీడీసీఎంఎస్ ఛైర్మన్ పదవులు రెండూ కూడా తిరుపతి జిల్లా పరిధిలోని వారికే దక్కడం విశేషం.

# ఏసీబీకి చిక్కిన శ్రీకాళహస్తి సర్వేయర్

- రూ.25 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పురుషోత్తంరెడ్డి



సర్వేయర్ పురుషోత్తంరెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండల సర్వేయర్ పురుషోత్తంరెడ్డి ఏసీబీ అధికారులకు చిక్కాడు. వ్యవసాయ భూమి కన్వర్షన్ కోసం రూ.25వేలను లంచంగా తీసుకుంటుండగా పట్టుబడ్డాడు. ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన కె.చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌శాఖలో ప్రొటోకాల్ అధికారిగా పదవీ విరమణ చేశారు. శ్రీకాళహస్తిలోని పానగల్ వద్ద ఆయన ప్రైవేటు కళాశాల నిర్వహిస్తున్నారు. పట్టణ శివార్లలోని విశాలాక్షి కాలనీ ఎదురుగా పానగల్ రెవెన్యూ పరిధిలో సర్వే నెం.172లో 75సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. దీనిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు (ల్యాండ్ కన్వర్షన్ కోసం) సుమారు రూ.1.70లక్షలు ప్రభుత్వానికి చలానా కట్టారు. రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దీనికి మండల సర్వేయర్ పురుషోత్తం రెడ్డి లంచం డిమాండు చేయగా.. చంద్రశేఖర్ రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం తహసీల్దారు కార్యాలయంలో చంద్రశేఖర్‌రెడ్డి నుంచి సర్వేయర్ పురుషోత్తంరెడ్డి రూ.25 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 వరకు తహసీల్దారు కార్యాలయంలో విచారించారు. తహసీల్దారు లక్ష్మీనారాయణను ఏసీబీ అధికారులు కార్యాలయానికి పిలిపించారు. అలాగే ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి కూడా తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. విచారణ అనంతరం సర్వేయర్ పురుషోత్తంరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆయన్ను నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు ఏఎస్పీ విమలకుమారి తెలిపారు. ఈ కేసుపై మరింత లోతుగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ ప్రశాంతి, సీఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### లంచం కోసం తిప్పలు పెట్టారు



నేను 2000లో కొన్న 75సెంట్ల వ్యవసాయభూమి కన్వర్షన్ కోసం ఫిబ్రవరిలో దరఖాస్తు చేశా. తహసీల్దారు లక్ష్మీనారాయణను, డీటీ ప్రేమ్‌కుమార్‌ను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినా పనికాలేదు. దీంతో రెండోసారి షిర్డీకి వెళ్లి సాయిబాబాకు మొక్కుకుని దరఖాస్తు చేసినట్లు అధికారులకు చెప్పా. అయితే సాయిబాబా నీ పని పూర్తి చేస్తాడంటూ తహసీల్దారు, డీటీ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు. 72 ఏళ్ల వయసులో ఎన్నిసార్లు కార్యాలయానికి వచ్చినా కనీసం కూర్చోమని చెప్పిన పాపాన పోలేదు. సర్వేయర్ పురుషోత్తంరెడ్డి రూ.30వేలు లంచం ఇవ్వాలంటూ రెండు నెలలుగా తిప్పాడు. చివరకు బేరమాడితే రూ.25వేలకు వచ్చాడు. అవినీతిని ప్రోత్సహించడం ఇష్టంలేక ఏసీబీ అధికారులను ఆశ్రయించా.

- కె.చంద్రశేఖర్‌రెడ్డి, బాధితుడు

# ఆరిమేనిపాడు క్వారీ అనుమతి రద్దు

- మైనింగ్ షరతులు పాటించకపోవడంతో పీసీబీ నిర్ణయం



గ్రావెల్ కోసం తీసిన గోతులు

ఓజిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడులో క్వారీ అనుమతులను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) నిర్ణయం తీసుకుంది. తక్షణమే క్వారీని నిలుపుదల చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామానికి చెందిన కొండగుట్ట సర్వేనెంబరు 65లో 10.926 హెక్టార్ల భూమిని గతంలో క్వారీ కోసం విశాంత్ ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్‌కు అధికారులు లీజు కింద మంజూరు చేశారు. లీజు అగ్రిమెంటు, పీసీబీ నిబంధనల షరతుల మేరకు గ్రావెల్ తరలించాలి. కానీ, నిర్వాహకులు షరతులను మీరినట్లు పీసీబీ అధికారులు నిర్ధారించి మైనింగ్ అనుమతులను రద్దు చేశారు.

### తొలి నుంచీ గ్రామస్థుల పోరాటం

కొండగుట్టలో గ్రావెల్ క్వారీకి అధికారులు అనుమతి ఇవ్వడంతో ఆరిమేనిపాడు గ్రామస్థులు పోరాటం చేపట్టారు. క్వారీకి అనుమతిచ్చిన ప్రాంతం గ్రామంలోని పశువుల మేతకు, నీటి వనరులకు కేంద్రంగా ఉంది. దీంతో ఇక్కడనుంచి గ్రావెల్ తరలింపుతో తమకు సమస్య ఎదురవుతుందంటూ ఆందోళనకు దిగారు. 'మైనింగ్ శాఖ అనుమతులు రద్దు అయితేనే సమస్యకు పరిష్కారం. అంతవరకు క్వారీ ప్రాంతంలో ఎలాంటి ఆందోళనలు చేపట్టినా చట్టం అతిక్రమించిన వారవుతారు' అంటూ పోలీసులు గ్రామస్థులను హెచ్చరించారు. దీంతో గ్రామస్థులంతా కలిసి మైనింగ్, పీసీబీ అధికారులను ఆశ్రయించారు. ఇక్కడి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ అధికారులు ఆరిమేనుపాడు క్వారీ ప్రాంతాన్ని సందర్శించారు. క్వారీ అనుమతులు పొందిన యాజమాన్యం మైనింగ్, పీసీబీ నిబంధనలు, షరతులను అతిక్రమించినట్లు గుర్తించారు. ఈ మేరకు నివేదికలు ఇవ్వడంతో అనుమతులు రద్దు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# గజదాడుల నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

**ఏనుగుల విధ్వంసంపై డిప్యూటీ సీఎం సమీక్ష**

మంగళం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడం, రైతులపై దాడులు చేస్తుండడంపై డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం సమీక్షించారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గజదాడులను అదుపులోకి తెచ్చేందుకు మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. చిన్నగొట్టిగల్లులో మూడురోజుల క్రితం ఏనుగు ఒక కౌలు రైతును తొక్కి చంపివేయడం, పాకాల మండలం గానుగపెంటలో పంటలను ధ్వంసం చేయడం ప్రస్తావించిన ఆయన ఏనుగుల వల్ల ప్రజలకు, ప్రజల వల్ల ఏనుగులకు ఎలాంటి హాని కలుగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఎలిఫెంట్ కారిడార్‌లో భాగంగా ఏనుగుల మందలు, ఒంటరి ఏనుగులు ఎటు వెళ్తున్నాయో ట్రాక్ చేయడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఎలిఫెంట్ ట్రాకర్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్పష్టంచేశారు.ఇందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించారు. ఈ మేరకు తిరుపతి డీఎఫ్‌వో వివేక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ భాకరాపేట, పనబాకం, తిరుపతి రేంజి, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్‌రేంజ్‌లలో పనిచేస్తుందని సీసీఎఫ్ సెల్వం తెలిపారు. సౌర విద్యుత్ ద్వారా పనిచేసే జీఎస్ఎం సిమ్ ఏనుగుల కదలికలను గుర్తించి తిరుపతిలో ఏర్పాటు చేయబోయే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేస్తుందన్నారు. గ్రామస్థులు ఏనుగుల గుంపు కనపడితే టోల్‌ఫ్రీ నెంబరు 18004255909, తిరుపతి డీఎఫ్‌వో 94408 10069, తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో 94408 10070కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అనారోగ్యం, ఇతరత్రా సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పలువురికి సహాయనిధి నుంచి సాయమందింది. సీఎం చంద్రబాబునాయుడు సూచనల మేరకు రూ.63.35లక్షల మేర మంజూరయ్యాయి. రఘునాథ్ రిసార్ట్‌లోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం ఈ సహాయ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**భాకరాపేట:** చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే నాని పంపిణీ చేశారు. చిన్నగొట్టిగల్లుకు చెందిన కుప్పయ్యశెట్టికి రూ.86,750, ఎస్.బాలసుబ్రహ్మణ్యం శెట్టికి రూ.27,295మేర చెక్కులను అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, మదనమోహన, ఆర్వీ రమణారెడ్డి, మోహన్ రెడ్డి, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## రేపు ఎస్వీ పోటు కార్మికుల సొసైటీ నేతల ఎన్నిక

తిరుమల, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర పోటు వర్కర్స్ లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ తిరుమల పాలకవర్గానికి సంబంధించిన అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శిని బుధవారం కమిటీ సభ్యులు ఎన్నుకోనున్నారు. నూతన పాలకవర్గానికి సంబంధించి ఏడుగురు సభ్యుల కోసం ఆదివారం తిరుమలలోని ఎస్వీ హైస్కూల్‌లో ఎన్నికల అధికారి సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. 22 మంది అభ్యర్థులు పోటీ పడిన క్రమంలో సునీల్‌కుమార్, దివాకర్, రామ్‌కుమార్, బాలాజీ, శంకర్, రఘు, వంశీకృష్ణ గెలుపొందారు. ఈకమిటీ సభ్యులు బుధవారం తిరుమలలోని ఎస్వీ హైస్కూల్‌లో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శిని ఎన్నుకోనున్నారు.

## వేసవి విజ్ఞాన తరగతుల ప్రారంభం


వివిధ అంశాలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు

చంద్రగిరి, ఏప్రిల్ 28(ఆంధ్ర జ్యోతి): స్థానిక బజారు వీధి గ్రంథాయలయంలో ఉచిత వేసవి విజ్ఞాన తరగులు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం నుంచి జూన్ 6వ తేది వరకు ఈ తరగతులను నిర్వహించనున్నారు. ఈసందర్భంగా గ్రంథాలయ అధికారి రెడ్డమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు కథలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక పఠనం, జీకే, క్విజ్, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు, చదివి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని, ప్రతిభకనబరిన వారికి బహుమతులు కూడా ప్రదానం చేస్తామన్నారు. పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేస్తామన్నారు.

## భూసార పరీక్షల ఆధారంగా పంటలు వేసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె),ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా పంటలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ట్రైనింగ్ కోఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్య సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువు వేసుకుంటే దిగుబడి బాగా వస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మట్టి నమూనాలను పరీక్షించుకుంటే ఏ పంటలు వేయాలో చెబుతామన్నారు. దుక్కిలో వేసేందుకు మాత్రమే సిఫార్సు చేసే కాంప్లెక్సు ఎరువులను పంటలకు కూడా విరివిగా వాడుతున్నారన్నారు. దీనివల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు.

## కుంగిపోయిన వ్యవసాయ బావి



చంద్రగిరి, ఏప్రిల్ 28(ఆంధ్ర జ్యోతి): బుచ్చినాయుడుపల్లె సమీపంలో 40 ఏళ్ళనాటి బావి ఉన్నట్లుండి కుంగిపోయిందని కొందరు రైతులు సోమవారం చంద్రగిరిలో ఎమ్మెల్యే నానిని కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. మునిరత్నంనాయుడు, రవినాయుడులకు సంబంధించిన ఈ వ్యవసాయ బావిపై ఆధారపడి ఐదు ఎకరాల పొలాన్ని సాగు చేసుకుంటున్నామన్నారు. బావి కూలడంతో రెండు విద్యుత్ మోటారుల, రెండు స్టార్టర్లు, విద్యుత్ తీగలు, పైపులు నీటితొట్టెలు కూడా బావిలో కుంగిపోయాయన్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బాధిత రైతులను హామీ ఇచ్చారు.

## గోవింద ధామం పనులు వేగంగా చేపట్టాలి

చంద్రగిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది ఒడ్డున నిర్మిస్తున్న గోవిందధామం పనులు వేగంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. సోమవారం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. చంద్రగిరి అభివృద్ధి కమిటీ సభ్యులు, అధికారులతో చర్చించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, నాగరాజునాయుడు, గౌస్‌బాషా, టీడీపీ నాయకులు కొండూరు ప్రవీణ్, రాజులగారి వినోద్, సక్కూరి ధనంజయరెడ్డి, వేణు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## పంటపొలాలపై ఆగని గజదాడులు


చిన్నపాపయ్యగారిపల్లె సమీపంలో ధ్వంసమైన పంటలు

పాకాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గానుగపెంట పంచాయతీ పరిధిలో మూడవ రోజు కూడ ఏనుగులు విరుచుపడ్డాయి. పరిసర గ్రామాల రైతులకు చెందిన పంటలను ధ్వంసం చేశాయి. ఆదివారం రాత్రి చిన్నపాపయ్యగారిపల్లెకు చెందిన పి.శివయ్య సాగుచేసిన చెరకు, అరటి, కొబ్బరి పంటలను ధ్వంసం చేశాయి. పొలానికి వేసిన ఫెన్సింగ్ ధ్వంసం చేసి పైపులైన్‌లను ధ్వంసం చేశాయి. పంటలను తొక్కేసి తీవ్ర నష్టం కలిగించాయి. రైతులకు కునుకు కరువయ్యింది. ఇండ్ల నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు.

## కొత్త అడ్మిషన్ల కోసం టీచర్ల ప్రచారం

రామచంద్రాపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని రాయలచెరువు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని రాయలచెరువు, ఒడ్డుకాలువ, చిట్టత్తూరు గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలిసి తిరిగి తమ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సౌకర్యాలపై వారికి వివరించారు. సర్పంచ్ మురగయ్య, ఉపాధ్యాయులు మైథిలి, లోకేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

## సిఫార్సు లేఖల తాత్కాలిక రద్దు అభినందనీయం

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సామాన్య భక్తులను దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను మే 1 నుంచి జూలై 15 వరకు రద్దు టీటీడీ రద్దు చేయడాన్ని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి స్వాగతించారు. టీటీడీ బోర్డు సభ్యుల లేఖలను సైతం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.ఈవో, అడిషనల్ ఈవోలు తీసుకున్న నిర్ణయం ఫలితంగాసాధారణ భక్తులంతా స్వామివారిని దర్శించుకునేందుకు వీలవుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రవేశపెట్టిన లఘు, మహాలఘు దర్శనాలకు కూడా రద్దు చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## నగరవనాన్ని పరిశీలించిన విచారణ అధికారి

మంగళం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ప్రొడక్షన్ విభాగం పీసీసీఎఫ్ చలపతిరావు సోమవారం కపిలతీర్థం వద్ద నగరవనాన్ని సందర్శించారు. ఈవనంలో కేఫ్టేరియా(వనరుచి క్యాంటీన్)ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు చెట్లను తొలగించిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో విచారణ అధికారిగా నియమితులైన ఈయన ఇక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఇక్క టీటీడీకి సంబంధించిన చిన్న రూమ్ ఉండేదని, అటవీశాఖ అధీనంలోకి వచ్చాక మొక్కలను పెంచారన్నారు. అటవీశాఖ సిబ్బంది, పర్యాటకుల కోసం కెఫ్టేరియా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారన్నారు. కెఫ్టేరియా నిర్మాణంలో భాగంగా తురాయి, పచ్చ తురాయి, రావి, చిన్నపాటి వేపచెట్లను తొలగించినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. తొలగించిన చెట్లు మళ్లీ చిగురిస్తున్నాయన్నారు అధికారులతో సమావేశమై వారి వివరణ సేకరించాక తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ఆయన వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి విద్యార్థి దుర్మరణం


మృతి చెందిన విద్యార్థి బషీర్

చంద్రగిరి, ఏప్రిల్ 28(ఆంధ్ర జ్యోతి): సరదాగా ఈతకు వెళ్లి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం మేరకు చంద్రగిరిలో చంద్రగిరి కొత్తపేటకు చెందిన ఖాదర్ బాషా, నూర్జా దంపతుల కుమారుడు బషీర్(16) అగరాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇతడు స్నేహితులు బన్నీ, సాయి, చరణ్, పునీత్‌లతో కలిసి సరదాగా మూలస్థాన ఎల్లమ్మ ఆలయం సమీపంలోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్ళాడు. వాస్తవానికి బషీర్‌కు ఈత సక్రమంగా రాదు. అయినప్పటికీ బావిలోకి దూకాడు. కానీ ఎంతసేపటికీ పైకి రాలేదు. దీంతో తోటి స్నేహితులు భయాందోళనతో స్థానికులకు, పోలీసులకు తెలియజేశారు. పోలీసులు చేరుకుని ఈతగాళ్లను బావిలోని దించారు. అప్పటికే నీటిలో బషీర్ మృతి చెందాడు. వారు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 11న వెంగమాంబ జయంతి

తిరుమల, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి ఉత్సవాలు మే 11న తిరుమలలో జరుగనున్నాయి. ఆరోజు మధ్యాహ్నం నాదనీరాజనం వేదికపై ప్రత్యేక సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇక, సాయంత్రం తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి సమర్పిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శ్రీవారి ఉత్సవమూర్తులను నారాయణగిరిలోని వేదికపై వేంచేపు చేసి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహిస్తారు.

**మే నెలలో ఉత్సవాలు ఇవీ..**

మే 1వ తేదీన అనంతాళ్వార్ ఉత్సవం, 2న భాష్యకారుల శాత్తుమొర, రామానుజ జయంతి, శంకర జయంతి, 6 నుంచి 8వ తేదీ వరకు పద్మావతి పరిణయోత్సవాలు, 10న అనంతాళ్వార్ శాత్తుమొర, 11న నృసింహజయంతి, 12న అన్నమాచార్య జయంతి, పౌర్ణమి గరుడసేవ, 22న హనుమజ్జయంతి ఉత్సవాలు జరుగనున్నాయి.

## మరో 'సైబర్' మోసం

● రూ.2.25 లక్షలు

### పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీరు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీరు దాదాపు రూ 2.25 లక్షలు పోగొట్టుకున్న ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు..డీఆర్ మహల్ రోడ్డులోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిషోర్‌కుమార్‌కు వారం కిందట సైబర్ నేరగాళ్లు ఒక లింక్ పంపారు. దీనిపై రివ్యూలు ఇస్తే డబ్బులు వస్తాయంటూ నమ్మించి మరో టెలిగ్రామ్ యాప్ పంపారు. ఈ యాప్ ద్వారా అవసరమైన డబ్బులు పంపితే మీకు రివ్యూలు ద్వారా ఆదాయం వస్తుందన్నారు. దీంతో ఆయన పలు దఫాలుగా రూ.2.25 లక్షలు పంపారు. ఆ తర్వాత వారి మొబైల్ ఫోను పనిచేయక పోవడంతో మోసపోయినట్లు గుర్తించిన కిషోర్‌కుమార్.. ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

## అతిగా మద్యం తాగి ట్యాక్సీ డ్రైవర్ మృతి

రేణిగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ట్యాక్సీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన తారకరామా నగర్‌లో సోమవారం జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు... తిరుపతి నగరం మంగళానికి చెందిన మురళీధరన్ (64) ట్యాక్సీ డ్రైవర్. తారకరామానగర్‌కు చెందిన ఆచారితో కలిసి ఆదివారం రాత్రి తిరుపతిలో మద్యం తాగాడు. ఆచారితో ఆయన ఇంటికి చేరుకుని అక్కడే నిద్రపోయాడు. తన బంధువు మంగళంలో మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనడానికి ఆచారి వెళ్లాడు. కార్యక్రమాల అనంతరం ఇంటికి చేరుకున్నాడు. మంచంపై పడుకున్న మురళీధరన్ మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. వెంటనే ఆయన భార్య శాంతికి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## నేడు ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని ఈనెల 29న మంగళవారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయాన్ని ఉదయం 7 గంటల నుంచి లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు.

## ఆరేళ్ల తర్వాత పోలీసులకు చిక్కిన దొంగ

● 301 గ్రాముల బంగారం, రూ.3 లక్షల నగదు, ద్విచక్రవాహనం స్వాధీనం

చంద్రగిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):కల్‌రోడ్డుపల్లె పంచాయతీ కొత్తఇండ్లులో గతేడాది జరిగిన చోరీలో నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి డీఎస్పీ ప్రసాద్ విలేకర్ల సమావేశంలో ఈ ఘటన వివరాలను వెల్లడించారు. మండలంలోని కొత్తఇండ్లుకు చెందిన సిద్దులునాయుడు ఇంట్లో గతేడాది నవంబరులో దొంగతనం జరిగింది. 305 గ్రాముల బంగారం, రూ.6 లక్షల నగదు అపహరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపటారు. ఈఏడాది జనవరి 7న తెలంగాణ సూర్యాపేట జిల్లా పోలీసులు ఓ చోరీ కేసులో పల్నాడు జిల్లాకు చెందిన షేక్ బాబావల్లిని అరెస్ట్ చేశారు. అతడ్ని విచారించగా కొత్తఇండ్లులో దొమ్మలపాటి సిద్దులనాయుడు ఇంట్లో తనతో పాటు తిరుపతి ఎంఆర్‌పల్లె వద్ద శ్రీకృష్ణనగర్‌కు చెందిన పులి నరేష్ దొంగతనానికి పాల్పడినట్లు చెప్పాడు. అక్కడి పోలీసుల సమాచారంతో చంద్రగిరి పోలీసులు నరేష్ కోసం గాలింపు చేపట్టారు. శ్రీకృష్ణనగర్‌లో ఇంటివద్ద కాపు కాసి నిందితుడు నరేష్‌ను సోమవారం పట్టుకున్నారు. అతడ్ని అరెస్ట్ చేసి 301 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్‌ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకొన్న ఆభరణాలు,నగదు


విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

## రూ.10లక్షలతో సోలారు సీసీ కెమెరాల ఏర్పాటు

● వైర్‌లెస్ కనెక్టివిటీతో ఆన్‌లైన్ ద్వారా ఎక్కడి నుంచైనా పర్యవేక్షించే అవకాశం ● ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో రూ.10 లక్షలతో 150 సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్‌తో సంబంధం లేకుండా పనిచేసేలా సోలార్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇవి సౌరశక్తితో పనిచేస్తూ పర్యావరణానికి అనుకూలంగా ఉంటాయని తెలిపారు. ఆడియో, వీడియో సౌకర్యం ఉంటుందన్నారు. వైర్‌లెస్ కనెక్టివిటీతో, స్మార్ట్ ఫోన్ ద్వారా ఎక్కడి నుంచైనా పర్యవేక్షించవచ్చన్నారు. తిరుపతి, చంద్రగిరి ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, ఎస్బీ సీఐ సాదిక్ ఆలీ, సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, కమాండ్ కంట్రోల్ సీఐ ఈశ్వర్, ఆర్‌ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.


సోలార్ సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

## మూడు గంటలు చీకట్లో రుయా పరిపాలనా భవనం


అల్ట్రాసౌండ్ స్కానింగ్ వద్ద రోగులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సోమవారం రుయా పరిపాలనా భవనం సిబ్బందికి, రోగులకు అవస్థలు తప్పలేదు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో కార్యాలయంలో ఉక్కపోత భరించలేక సిబ్బంది బయటే ఉపశమనం పొందాల్సి వచ్చింది. అత్యవసర పనులను మాత్రం సెల్‌ఫోన్ వెలుగులో చక్కబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు పరిపాలనా భవనంలోనే అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఉండటంతో అది కూడా పనిచేయక రేడియాలజీ విభాగం ముందే రోగులు చీకట్లో పడిగాపులు కాయాల్సి వచ్చింది. అదే భవనంలో ఉన్న ఎఫ్‌ఎస్ వార్డుల్లోని రోగులు ఉక్కపోతతో ఇబ్బందిపడ్డారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సరఫరా రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## 4నాటికి వాటర్‌సంప్ వినియోగంలోకి తేవాలి


ఎంపీడీవో చాంబర్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాని,

తిరుపతి రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేదాంతపురం అగ్రహారం సర్కిల్‌లోని వాటర్‌సంప్‌ని వచ్చేనెల 4వతేదీ కల్లా వినియోగంలోకి తేవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. ఎంపీడీవో చాంబర్‌లో సోమవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..వాటర్‌సంప్‌ని వినియోగంలోకి తెస్తే అవిలాల, గాంధీపురం, లింగేశ్వరనగర్, ఓటేరు, శ్రీనివాసపురం, వేదాంతపురం పంచాయతీలకు నీటిసమస్య తీరుతుందన్నారు. తనపల్లె జాతీయ రహదారి నుంచి మామిడికాయల మండివరకు రహదారి విస్తరణ పనులపై చర్చించారు. ఈక్రమంలో ఆయన ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఎంపీడీవో రామచంద్ర, అధికారులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన జపాన్ రాయబారి


జపాన్ రాయబారికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారత్‌లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. గత నవంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇది ఆయన మొట్టమొదటి శ్రీసిటీ పర్యటన. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకహాషి ముని యో, ఇతర అధికారులతో కలిసి విచ్చేసిన జపాన్ రాయబారి బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలి కారు. తొలిసారి శ్రీసిటీ సందర్శనే తొలి అజెండాగా జపాన్ రాయబారి ఇక్కడకు రావడం తమకు గర్వంగా ఉందని రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. శ్రీసిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సాధించిన విజయాలు, ప్రగతిని వారికి వివరిస్తూ దేశంలోనే జపాన్ పరిశ్రమలకు రెండో అతిపెద్ద పెట్టుబడి కేంద్రంగా శ్రీసిటీ ఆవిర్భవించిందని తెలిపారు. శ్రీసిటీ అభివృద్ధి, వ్యాపార అవకాశాలకు సంబంధించిన పలు అంశాలపై జపాన్ రాయబారి ఒనో కెయిచి చర్చలు జరిపారు. జపాన్ పెట్టుబడులను ప్రోత్సహించడంలో కీలకపాత్ర వహించడంతో పాటు ఇండో - జపాన్ ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో శ్రీసిటీ చురుకైన పాత్ర పోషిస్తోందని ఆయన ప్రశంసించారు. శ్రీసిటీలోని వివిధ జపాన్ పరిశ్రమలకు చెందిన ఉన్నతాధికారులతో సమావేశమ య్యారు.

## ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరత తీర్చండి

సత్యవేడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్ట ణంలోని సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరతను తీర్చాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలె క్టర్ వెంకటేశ్వర్లును కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు హేమభూషణం, ధనేష్, శోభ, చిన్నా తదిత రులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయానికి చేరు కుని ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అం దించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డు తూ... జిల్లాకు మారుమూలగా తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న సత్యవేడులో ప్రజల కు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ స్పత్రిలో గైన కాల జిస్ట్, అనస్థీషియన్ పో స్టులు ఖాళీగా ఉన్నా యని తెలిపారు. ఇది లా ఉండగా ఆస్పత్రి మెడికల్ సూపరింటెం డెంట్‌ను పుత్తూరుకు బదిలీ చేయడంతో ప్ర జలు ఇబ్బందులు పడుతున్నారని తెలి పారు. అదే విధంగా గత మూడు నెలలుగా ఖాళీ గా ఉన్న సత్యవేడు తహసీల్దార్ పోస్టును భర్తీ చేసి, రెవెన్యూ సమస్యల పరిష్కరించాలని కోరారు. టీటీడీ కల్యాణ మండపం నిర్మాణ పనులు, నాగలాపురం - చిన్నపాండూరు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించేలా చొరవ తీసు కోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కరిస్తానని చెప్పారు.

## పోలేరమ్మ జాతరకు విరాళం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని గ్రామదేవత పోలేరమ్మ జాతరకు పగడాల శివ ప్రదీప్ శివ ప్రదీప్ రూ.50116 విరాళంగా అందజేశారు. సోమవారం రాత్రి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ను కలిసి నగదు అందజేశారు. కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నానాబాల సుబ్బారావు, ధనుంజయ, గోపి, శ్యామ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, మైలాడి రాజశేఖర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించండి


క్షతగాత్రుడి చికిత్సను పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ స్విమ్స్‌లోని వైద్యాధికారులకు సూచించారు. పాకాల మండలం తోటపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న గీతమ్మ(51), క్రిస్విన్(16) పరిస్థితిని ఆయన తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ ఉన్నారు. కాగా, ఘటనా స్థలంలోనే మృతిచెందిన ఐదుగురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిస్తామని రుయా అధికారులు తెలిపారు.

## వేదోక్తంగా మృత్యుంజయుడి పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరా ల యంలో కొలువై ఉన్న మృత్యుం జయు డికి సోమవారాన్ని పుర స్కరించుకుని శాస్త్రో క్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులిచ్చారు. అనంతరం మృత్యుంజయు డిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు, మహా మంగళ హారతులు సమర్పించారు.

## కుప్పం మున్సిపల్ కోటపై పసుపు జెండా రెపరెపలు

కుప్పం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. ప్రతిష్ఠాత్మకమైన కుప్పం పురపాలక పీఠాన్ని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. పురపాలక చైర్మన్ ఎన్నిక సోమవారం ఉదయం 11 గంటలకు జరిగింది. వైసీపీ శిబిరంలోని 8 మంది కౌన్సిలర్లు ఉదయం 10 గంటలకే ఎన్నిక స్థలమైన సమావేశపు హాలుకు చేరుకున్నారు. వారి వెంట ఎమ్మెల్సీ భరత్ ఉన్నారు. టీడీపీ శిబిరంలోని 10 మంది కౌన్సిలర్లతోపాటు అదనంగా నలుగురు వైసీపీ కౌన్సిలర్లు కూడా ఉదయం మొదట పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాహనంలో బయలుదేరి మండల సచివాలయానికి వచ్చారు. వైసీపీకి చెందిన 14వ వార్డు కౌన్సిలర్, 1వ వైస్ చైర్మన్ బి.మునస్వామి, 15వ వార్డు కౌన్సిలర్ తిలవతి గైర్హాజరయ్యారు. ప్రిసైడింగ్ అధికారి అయిన ఆర్డీవో శ్రీనివాసరాజు సరిగ్గా ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్సీలు, 22మంది కౌన్సిలర్ల సంతకాలు సిబ్బంది ద్వారా తీసుకున్నాక చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. టీడీపీ చైర్మన్ అభ్యర్థిగా 5వ వార్డు కౌన్సిలర్ వి.సెల్వరాజ్ పేరును 19వ వార్డు కౌన్సిలర్ బి.కె.దామోదర్ ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ ఎస్.సోమశేఖర్ బలపరిచారు. వైసీపీ చైర్మన్ అభ్యర్థిగా 9వ వార్డు కౌన్సిలర్, 2వ వైస్ చైర్మన్ ఎస్.డి.హఫీజ్ పేరును 2వ వార్డు అభ్యర్థి ఆర్.మునిరాజు ప్రతిపాదించగా 7వ వార్డు అభ్యర్థి ఎం.నాగరాజు బలపరిచారు. . ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, కె.ఆర్.జె.భరత్‌లతో పాటు 22 మంది కౌన్సిలర్లు కలిసి మొత్తం 24 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి వి.సెల్వరాజ్‌కు 15 ఓట్లు, వైసీపీ అభ్యర్థి ఎస్.డి.హఫీజ్‌కు 9 ఓట్లు వచ్చాయి. దీంతో 6 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి వి.సెల్వరాజ్ గెలిచినట్లు ప్రకటించారు.


సెల్వరాజ్‌కు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న పీవో శ్రీనివాసరాజు

**చక్రం తిప్పిన ఎమ్మెల్సీ కంచర్ల**

మున్సిపల్ కౌన్సిల్‌లో టీడీపీ తరపున గెలిచిన ఆరుగురు కౌన్సిలర్లతోపాటు వైసీపీనుంచి చేరిన నలుగురు కలిసి మొత్తం 10 మంది కౌన్సిలర్లున్నారు. వైసీపీకి 14 మంది కౌన్సిలర్లున్నారు. చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ రాగానే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రంగంలోకి దిగారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబుతోపాటు పార్టీలోని ముఖ్యులైన ద్వితీయ శ్రేణి నేతలు, ముఖ్య కార్యకర్తలతో కలిసి వ్యూహం రచించారు. టీడీపీ నిర్వహించిన శిబిరానికి ఎన్నికకు మూడునాలుగు రోజుల ముందే వైసీపీ కౌన్సిలర్లు అరవింద్, చంద్రమ్మ (గణపతి తల్లి), దేవకి (రంగయ్య భార్య), సయ్యద్ అలీ చేరుకున్నారు. మరోవైపు వైసీపీకి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ మునస్వామి, ఆయన తల్లి అయిన 15వ వార్డు కౌన్సిలర్ తిలవతి సైలెంట్ అయ్యారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్సీ భరత్ మంత్రాంగం చేసినా ఆ పార్టీ శిబిరంలో 8మంది కౌన్సిలర్లు మాత్రమే మిగిలారు.చివరకు టీడీపీలో ఇప్పటికే ఉన్న 10 మంది కౌన్సిలర్లతోపాటు వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు టీడీపీ అభ్యర్థికి జై కొట్టారు.

### పారిశుధ్యం

# మూలనపడింది

- నిరుపయోగంగా వదిలేసిన వాహనాలు
- కొత్త ట్రాక్టర్లదీ అదే పరిస్థితి



సప్తగిరికాలనీ సచివాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్, లగేజీ రిక్షాలు - రణధీరపురం సచివాలయం ముందు పాడైపోతున్న లగేజీ వాహనాలు - తిరుమలనగర్ సచివాలయం ముందు తుప్పుపట్టిన ఆటో, ట్రాక్టర్ - శెట్టిపల్లి సచివాలయం ముందు ఉన్న లగేజీ ఆటో, రిక్షాలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మంగళం పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ కోసం కొనుగోలు చేసిన, విరాళంగా వచ్చిన వాహనాలు సచివాలయాల ఆవరణలో మూలనపడేయడం విమర్శలకు తావిస్తోంది. శెట్టిపల్లి గ్రామసచివాలయం ముందు ఎలక్ట్రిక్ ఆటో, నాలుగు లగేజీ రిక్షాలు, తిరుమలనగర్ సచివాలయంలో ట్రాక్టర్, ఎలక్ట్రిక్ లగేజీ ఆటోలు తుప్పపట్టి పిచ్చిమొక్కలు, కంపచెట్ల మధ్య శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. రణధీరపురం సచివాలయంలో ఆరు లగేజీ రిక్షాలు, ఎలక్ట్రిక్ లగేజీ ఆటో, సప్తగిరికాలనీ సచివాలయంలో ఆరు లగేజీ రిక్షాలను మూలనపడేశారు. మరమ్మతులు చేయడానికి పనికిరాని స్థితికి చేరుకున్నాయి. డ్రైనేజీల వ్యర్థాలను తరలించడానికి సాధారణ ట్రక్కునే వినియోగిస్తుండడం గమనార్హం. ఇటీవల ఓ కంపెనీ మంగళం 2, సప్తగిరి కాలనీ సచివాలయాలకు ఒక్కొక్కటి చొప్పున ట్రాక్టర్లను వితరణ చేసింది. వాటికి ట్రక్కు సమకూర్చుకోలేక చెట్లకింద, షెడ్డు లోపల పడేశారు. వీటిని చూసిన స్థానికులు అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమంటూ చెవులు కొరుక్కొంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన శిక్షణ ఐఏఎస్ అధికారి



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శిక్షణలో భాగంగా ట్రైనీ(అసిస్టెంట్) కలెక్టర్ సందీప్ రఘువంశీ సోమవారం జిల్లాకు వచ్చారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పాలనపరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు.

## బాలకృష్ణ అభిమానుల అన్నదానం



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అభిమాన హీరో సినిమా హిట్ అయితే సంబరాలు చేసుకునే అభిమానులను చూశాం. అయితే తిరుపతిలో బాలకృష్ణ అభిమానులు అం దుకు భిన్నంగా వ్యవహరిస్తూ సేవా కార్యక్రమాల ద్వారా అందరి అభినందనలు అందుకుంటున్నారు. పేదలకువిద్య, వైద్యంలో చేయూతనిస్తున్నారు. బాలకృష్ణ సోమవారం పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా స్థానిక అన్నక్యాంటీన్, రుయా ఆస్పత్రి వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు మనోహర్‌రెడ్డి, కె.పి.చౌదరి, మదన్‌మోహన్, షఫీ, రాంబాబు పాల్గొన్నారు.

## టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అభినందనలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బీసీ వసతిగృహాల్లో విద్యను అభ్యసించి టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కలెక్టరేట్‌లో మాధురి, పల్లవి, వెంకటేష్, ముజీఫ్, లక్ష్మీప్రసాద్, ప్రీతిజింటాను అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌కు 45 వినతులు



తిరుపతి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 45 వినతులు వచ్చాయని ఇన్‌చార్జి కమిషనర్ అమరయ్య తెలిపారు. చేపల మార్కెట్ ఎదురుగా కాలువలు సరిచేయాలని, అన్నారావు సర్కిల్ వద్ద నీటి సమస్య పరిష్కరించాలని, మధురానగర్‌లో యూడీఎస్ పనులు పూర్తి చేయాలని పిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్రనారాయణ, ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి, ఎంఈలు తులసీకుమార్, గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, డీపీపీ మహాపాత్ర పాల్గొన్నారు.

## మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలకు విశేష స్పందన



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలకు విశేష స్పందన లభించిందని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి తెలిపారు. తిరుపతిలో 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. విద్యార్థులకు ఉపయుక్తమైన మోడల్ పరీక్షలను తమ కళాశాలలో నిర్వహించేందుకు అవకాశం ఇచ్చిన అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ కుమార్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## విధులు బహిష్కరించి నిరసన



డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రతతో పాటు న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పీలు విధులు బహిష్కరించి సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు నిరసనకు దిగారు. సమస్యల పరిష్కారం కోసం వారు పది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న విషయం విదితమే. ప్రభుత్వం స్పందించకపోవడంతో విధులు బహిష్కరించి, సమ్మెబాట పట్టారు. ఎంఎల్‌హెచ్‌పీల అసోసియేషన్ నేతలు మేరీకృప, సుమంత్ పాల్గొన్నారు.

## మరింత బాధ్యతగా పనిచేయండి



డిపో మేనేజర్లతో సమావేశమైన డీపీటీవో నరసింహులు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల దృష్ట్యా మరింత బాధ్యతగా పనిచేస్తూ సంస్థకు ఆదాయం సమకూర్చాలని డీపీటీవో జి.నరసింహులు కోరారు. ఆయన బుధవారం ఉద్యోగ విరమణ చేయనుండడంతో సోమవారం ఉదయం చివరిసారిగా అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. అందరూ సమన్వయంతో వ్యవహరిస్తూ సంస్థకు మరింత మంచి పేరు తీసుకురావాలన్నారు. ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచాలన్నారు. సిబ్బంది కొరతను భర్తీ చేయాలని, రద్దీకి అనుగుణంగా బస్సులు తిప్పాలని అన్నారు. అనంతరం డిపో మేనేజర్లు ఆయన్ను సన్మానించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీటీఎం పి.విశ్వనాథం, డీఎంలు భాస్కర్, బాలాజీ, హరిబాబు, ప్రశాంతి, పీవో సహజాద్, మునిచంద్ర, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## ఎల్లమ్మకు డాక్టరేట్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ హిస్టరీ విభాగ పరిశోధక విద్యార్థిని కె.ఎల్లమ్మ డాక్టరేట్ పొందారు. ఏ హిస్టారికల్ స్టడీ ఆఫ్ ఫెమినిస్ట్ మూమెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అంశంపై ఆమె పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు వర్సిటీ సౌత్ ఈస్ట్ ఏషియన్ అండ్ పసిఫిక్ స్టడీస్ ప్రొఫెసర్ విజయకుమార్‌రెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో 21 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 21 మందికి తిరుపతి అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం జరిమానా విధించారు. ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున 21 మందికి రూ.2.10 లక్షలు జరిమానా విధించారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైలు పైకి ఎక్కి విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన తిరుపతి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ విఠల్ నాయక్ వివరాల మేరకు.. తిరుపతి రైల్వేస్టేషన్ పరిధిలో హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌ను పిట్‌లైన్‌లో పెట్టే సమయంలో ఒక గుర్తు తెలియని యువకుడు దానిపైకి ఎక్కాడు. విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై మృతిచెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలూ లభ్యం కాలేదు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ విఠల్ నాయక్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. సమాచారం తెలిస్తే 9440627638ను సంప్రదించాలని కోరారు.

## అనారోగ్యంతో నైజీరియన్ మృతి



శామ్‌సన్ ఓకాన్ సండే మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎల్‌బీ నగర్‌లో నైజీరియాకు చెందిన వృద్ధుడు అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. యూనివర్సిటీ సీఐ రామయ్య వివరాల మేరకు.. నైజీరియాకు చెందిన శామ్‌సన్ ఓకాన్ సండే ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఎస్వీ యూనివర్సిటీలో 2006 నుంచి 2010 వరకు ఎంఎస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశాడు. గణాంక విభాగంలో పరిశోధన పూర్తిచేశాడు. ఆదివారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

## యువకుడిపై హత్యాయత్నం



గాయపడిన వంశీతేజ్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన అమెరికన్ బార్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. సప్తగిరి నగర్‌కు చెందిన వంశీతేజ స్నేహితులు లోకేష్, చిరంజీవితో కలసి అమెరికన్ బార్‌లో మద్యం తాగారు. వారి టేబుల్ పక్కనే గాలివీధికి చెందిన బావజాన్, సాయి, మరో ఇద్దరు వ్యక్తులతో కలసి మద్యం తాగారు. బయట నిలబడి ఉన్న లోకేష్‌ను బావజాన్ గట్టిగా తోశాడు. లోకేష్‌ను ఎందుకు తోస్తున్నావని బావజాన్‌ను వంశీతేజ్ నిలదీశాడు. 'నువ్వు ఎవడ్రా అడగడానికి' అని వంశీతేజ్‌పై బావాజాన్ గొడవకు దిగాడు. వంశీతేజ్, లోకేష్, చిరంజీవి కలిసి బావజాన్‌పై దాడికి దిగారు. ఆగ్రహానికి గురైన బావజాన్ తాను పనిచేసే మటన్ షాపులోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి వంశీతేజ్‌పై దాడి చేశాడు. వంశీతేజ్‌కు బలమైన గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతన్ని తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## మహిళపై దాడి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మహిళపై టాటా మోటర్స్ సిబ్బంది దాడి చేసిన ఘటన సోమవారం సరస్వతినగర్ వద్ద చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ రామకృష్ణ వివరాల మేరకు.. సరస్వతినగర్‌కు చెందిన దివ్యరాణి మెయిన్ రోడ్డుకు నడిచివస్తోంది. టాటా మోటర్స్ వారు రోడ్డుకు అడ్డుగా వాహనాలు పెట్టి ఉండడంతో ప్రశ్నించింది. టాటా మోటార్స్ సిబ్బంది రోహిత్‌తో పాటు మరికొంత మంది తనపై దాడి చేశారని బాధితురాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## గంగమ్మ ఆలయంలో సీఐ తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు బాలకృష్ణ, గిరిబాబు, మహేశ్, ఏఎస్ఐ జగన్‌మోహన్ రెడ్డి, సిబ్బంది కలసి సోమవారం ఆలయంలో తనిఖీ చేశారు. మే 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జాతరలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

## తీవ్రవాదం అంతానికి నడుం బిగించాలి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తీవ్రవాదాన్ని అంతమొందించడానికి, దేశ సమగ్రతను కాపాడటానికి అందరూ నడుం బిగించాలని భారత్ యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ రాథోడ్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. పాకిస్తాన్ ప్రేరేపిస్తున్న ఉగ్రవాదాన్ని అణచివేయాలని, అందుకు భారత ప్రభుత్వం చేపట్టే ఏ చర్యలకైనా యువతరం సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో నాయకులు నరసింహులు, సీతారాములు, రెడ్డెప్ప, వెంకటేశులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో నాన్ టీచింగ్ ఉద్యోగుల బదిలీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని వివిధ విభాగాలకు చెందిన నాన్ టీచింగ్ ఉద్యోగులకు స్థాన చలనం కలిగింది. 40 మందికి పైగా వివిధ స్థాయిలకు చెందిన నాన్ టీచింగ్ ఉద్యోగులను బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు సోమవారం జారీ చేశారు.

## పుస్తక పఠనాన్ని అలవరచుకోండి



మాట్లాడుతున్న డీవైఈవో బాలాజీ, అతిథులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అందరూ పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని తిరుపతి ఉప విద్యాశాఖాధికారి కె.బాలాజీ పిలుపునిచ్చారు. అన్నమయ్య కూడలి సమీపంలోని గ్రేడ్-1 గ్రంథాలయంలో వేసవి ఉచిత విజ్ఞాన తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. చినిగిన చొక్కా అయినా తొడుక్కో... మంచి పుస్తకం కొనుక్కో అన్న కందుకూరి వీరేశలింగం పంతులు మాటలను గుర్తు చేశారు. గ్రంథాలయ శాఖ ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను నిర్వహించడం చాలా ఉపయుక్తమన్నారు. ముఖ్య అతిథులు ఇంపాక్ట్ ట్రైనర్ నడ్డి నారాయణ, ఉయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసున్నిసా బేగం మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని వివరించారు. కార్యక్రమంలో ఎస్వీయూ విశ్రాంత అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్, గాయకులు సోము ఉమాపతి, విశ్రాంత ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత జనరల్ మేనేజర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా ఉద్యోగ సాధకుల విజయోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ డీఈవో సునీల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో ఇటీవల ఉద్యోగాలు పొందిన 110 మంది విద్యార్థులతో సోమవారం ఉద్యోగ సాధకుల విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ డీఈవో వెంకటసునీల్, ఆర్జేడీ నిర్మలకుమార ప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతమ్మ, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొని మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పద్మావతి మహిళా పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభకు మెరుగులు దిద్దుకుంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు. మోటివేషనల్ స్పీకర్ మెరుపుల మహేష్ విద్యార్థులకు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే మాటలు తెలియజేశారు.

## మత్స్యకారులకు భృతి హర్షణీయం



హర్షం ప్రకటిస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి(ఆటోనగర్), ఏపిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేట నిషేధ సమయంలో మత్స్యకారుల కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని టీడీపీ బెస్తసాధికార కమిటీ సభ్యులు పి.భక్తవత్సలం, ఏపీ బెస్త సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.మునిబాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు ఎలాంటి సహకారమూ అందక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారని తెలిపారు. భృతి మంజూరుతో వారి కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని అన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు లక్ష్మీదేవి, కళ్యాణ్‌చక్రవర్తి, శంకర్, గోవిందన్ పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. మే 7వ తేదీ వరకు డ్రాయింగ్, మ్యాథ్స్‌లో చిన్నారులకు మెలకువలు నేర్పిస్తారు. మే 12 నుంచి 21వ తేదీ వరకు కథలు, పాటలు, చేతిరాతపై మెలకువలు, 22 నుంచి 31వ తేదీ వరకు చెస్, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పిస్తారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు కర్రసాములో శిక్షణ ఉంటుంది. ఆరు నెలల పాటు వారంలో మూడు రోజులు క్లాసికల్ డ్యాన్స్‌లో శిక్షణ ఉంటుంది. వివరాలకు 8985080370, 9398000686లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

## సమస్యలపై నేడు చింతా ఆందోళన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ విద్యార్థుల, ఉద్యోగుల సమస్యలపై మాజీ ఎంపీ చింతామోహన్ మంగళవారం ఆందోళన చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు ఏడీ బిల్డింగ్ ముందు ఆయన ఈ కార్యక్రమాన్ని చేపడతారు.

## యోగాతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోజూ యోగా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు. రామకృష్ణ మిషన్‌లో సోమవారం వేసవి శిక్షణ శిబిరం (సంస్కార శిబిరం) ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో శిక్షణ వల్ల వ్యక్తిత్వ వికాసం పొందవచ్చన్నారు. భారతీయ విద్యాభవన్, శ్రీవెంకటేశ్వర విద్యాలయం డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విలువలు అందించాలని రామకృష్ణమిషన్ ప్రయత్నిస్తోందన్నారు. ఇక్కడ లభించే పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సుకృతానంద పాల్గొన్నారు.

# ఆరు కిలోల గంజాయి స్వాధీనం

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గూడూరులో ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కరీమాబేగం సోమవారం తెలిపారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన సెల్వకుమార్ మోహన్ రూ.30 వేల విలువ చేసే ఆరు కిలోల గంజాయి తీసుకెళ్తుండడంతో పట్టుకున్నామన్నారు.

# 30న నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్ష వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 30వ తేదీన నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్ష వాయిదా పడింది. ఈ పరీక్షను మే 15వ తేదీ నిర్వహించనున్నారు. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కారణంగా పరీక్ష వాయిదా వేసినట్లు పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

# నైపుణ్యాభివృద్ధి విభాగంలో రాజన్న ఫౌండేషన్‌కు అవార్డు

రేణిగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి విభాగంలో బెస్ట్ 3 స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇనిషియేటివ్ ఆఫ్ ద ఇయర్ 2025 అవార్డును రాజన్న ఫౌండేషన్ అందుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో రాజన్న ఫౌండేషన్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా సోమవారం న్యూఢిల్లీలోని హయత్ సెంట్రల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్ళపల్లి ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్, ఎక్స్ జనరల్ రమేష్ సచిదేవ్ చేతులు మీదుగా అందుకున్నారు. అవార్డు రావడం పట్ల రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు, అమర రాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ హర్షం వ్యక్తం చేశారు.



న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకుంటున్న దృశ్యం


# సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**శనివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు**

**ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,177**

**తలనీలాలు సమర్పించినవారు: 23,694**










# నగరానికి సప్తవర్ణాల గొడుగు

**ప్రసవం ఒక వేదన.. జననం ఒక ఆనందం.. తల్లికైనా.. పుడమి తల్లికైనా! మబ్బులు ముసురుకున్నంత మాత్రాన సూర్యోదయం ఆగదు. పసుపుపచ్చని లేత రంగులు నారింజవర్ణంలోకి మారి.. రవి కిరణ స్పర్శతో ఎర్రబారి.. నీలిమబ్బుల గొడుగుపట్టి.. ఇదిగో ఇలా ఎగసి వచ్చే భానుడికి రాగరంజితమై స్వాగతం పలుకకా తప్పదు.**

సోమవారం ఉదయం తిరుపతి నగరంలో కనిపించిన నింగి వర్ణ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ అందిస్తున్నారు.

# అతివేగం.. నిద్రమత్తు

## రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణాలు


సోమవారం నాటి ప్రమాదంలో ధ్వంసమైన కారు

### నిదానమే ప్రధానం వేగంకన్నా ప్రాణం మిన్న

జాతీయ రహదారి ఎక్కగానే ఈ సూక్తులను మరచిపోతున్నారు వాహన చోదకులు. టైమే లేదన్నట్లు.. వెంటనే వెళ్లిపోవాలన్నట్లు వాహనాలను పరుగు పెట్టిస్తున్నారు. మరోవైపు విశ్రాంతి లేక.. వాహనాన్ని నడిపే క్రమంలో అలసటతో పాటు కునుకుపాటు తప్పడంలేదు. అంతా బాగున్నంత వరకు ఇవన్నీ ఓకే.. కాకుంటే ప్రాణాలే పోతున్నాయి. ఎందరో వికలాంగులుగా మారుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

గతేడాది మే 27న చంద్రగిరి మండలం ఎం.కొంగరపల్లి వద్ద అతి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పింది. కల్వర్టును ఢీ కొంది. ఈ ప్రమాదంలో నరసరావుపేటకు చెందిన ఆరుగురు మృతి చెందారు. సోమవారం నాటి ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఇలా ఏడాది కాలంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై 26 ప్రమాదాలు చోటుచేసుకున్నారు. వీటిలో 32 మంది దుర్మరణం చెందారు. 11 మంది తీవ్రంగా గాయపడగా.. మరెందరికో స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదాలన్నింటిని పరిశీలించిన పోలీసులు.. అతివేగం, నిద్రమత్తే ఈ అనర్థాలకు కారణాలుగా విశ్లేషిస్తున్నారు. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి రెండు వరుసల రోడ్డుగా ఉన్నప్పుడే తరచూ ప్రమాదాలు జరిగేవి. ఇప్పుడు ఆరు వరుసలు రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఒక్కో వైపు మూడు వరసల రహదారి కావడం.. రోడ్డు బాగా వుండడంతో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. సోమవారం నాటి ప్రమాదానికీ అతివేగమే కారణమని ప్రాథమిక సమాచారం. నెమ్మదిగా వెళుతున్న కంటైనర్‌ను వెనుకనుంచీ ఎంతో బలంగా ఢీకొడితే గానీ కిందకు కారు దూసుకుపోయే అవకాశం లేదని పోలీసులు అంటున్నారు.

### విశ్రాంతిలేని ప్రయాణం

ఇక, తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి క్షేత్రాల సందర్శనకు దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఎక్కువ మంది సొంత.. అద్దె వాహనాల్లో బయలుదేరి తమ యాత్రను తక్కువ వ్యవధిలో ప్లాన్ చేసుకుంటారు. అలాంటప్పుడు సెల్ఫ్ డ్రైవింగ్ లేదా, డ్రైవర్లు కంటిన్యూగా ఎక్కువ దూరం వాహనాన్ని నడపడటంతో అలసట, నిద్రలేమి తలెత్తుతోంది. వేగంగా వచ్చే క్రమంలో కంటిమీద రెప్ప పడితే చాలు.. వాహనం అదుపు తప్పి ప్రమాదానికి కారణమవుతుంది. వేగంగా వెళ్లే సమయంలో జరిగే ప్రమాదాలతో ఎక్కువ ప్రాణనష్టం జరుగుతోంది. పరిమిత వేగం.. డ్రైవర్లకు విశ్రాంతి ఉండేలా యాత్ర ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

### హైవే పెట్రోలింగ్‌ను పటిష్ఠం చేస్తాం

ప్రమాదాలకు అతివేగం, నిద్రమత్తు కారణాలుగా తెలుస్తోంది. వీటిని అరికట్టేందుకు హైవే పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ఠరుస్తాం. స్పీడ్ మానిటరింగ్ ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రించేలా చర్యలు చేపడుతున్నాం. జాతీయ రహదారుల్లో రాత్రి, తెల్లవారు జామున వాహనాలను ఆపి తరచూ తనిఖీ చేస్తున్నాం. 'ప్లీజ్ రండి.. వాహనం ఆపండి. దయచేసి మంచినీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. కాసేపు విశ్రాంతి తీసుకుని ప్రయాణించండి' అనే నినాదాలతో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తాం. తద్వారా కొంతవరకు రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి సాధ్యమవుతుంది.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

# సగం సమస్యలు రెవెన్యూవే

**కలెక్టరేట్ చుట్టూ అర్జీదారుల ప్రదక్షిణలు ● పీజీఆర్ఎస్‌కు 285 వినతులు**

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై పీజీఆర్‌ఎస్‌లో వస్తున్న సమస్యల గురించి రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో వారం వారం ప్రజలు అర్జీలు చేతబట్టుకుని కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల్లో 80 శాతం భూ సమస్యలపైనే అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 285 మంది అర్జీదారులు వినతులు అందించారు. అందులో 145 రెవెన్యూ శాఖకే వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

### సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె



రెండేళ్లుగా సమస్యలు చెప్పుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటికీ స్పందించకపోతే వచ్చే సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించుకున్నామని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. ఈ మేరకు వారు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీహెచ్‌వోలు ప్రవళిక, మోహన్, అపర్ణ, సౌమ్య, రేవతి, నళిని, షీబా పాల్గొన్నారు.

### మా బడి మా ఊరిలోనే ఉండాలి


ఎమ్మెల్యే ఆదిమూలంతో మాట్లాడుతున్న ఇప్పతాంగల్ గ్రామస్తులు

'అయ్యా మాది నారాయణవనం మండలం, కళిమిట్ట పంచాయతీ, ఇప్పతాంగల్. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులను పక్క గ్రామమైన డీకేపాళెం పాఠశాలకు వెళ్లాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే ఆ ఊరికి వెళ్లాలంటే శ్మశానం, చెరువులు, గుంతలు దాటుకుని వెళ్లాలి. వర్షాకాలం వస్తే ఇబ్బందులు తప్పవు. అందుకే పిల్లలను అక్కడికి పంపించేది లేదు. మా బడి మా ఊరిలోనే ఉంచండి' అంటూ గ్రామానికి రమ్య, పూజ, మీనా తదితరులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అదే సమయంలో కలెక్టరేట్ నుంచి బయటకు వచ్చిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కలిసి సమస్యను వివరించారు.

### పింఛన్ కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా..



'నా భర్త ఆటోడ్రైవర్. రెండేళ్ల క్రితం మరణించాడు. నేను దివ్యాంగురాలిని. ఒంటరిగా ఉంటున్నాను. జీవనోపాధి చాలా దుర్భరంగా ఉంది. పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి మహాప్రభు' అంటూ ఆటోనగర్‌కు చెందిన విజయలక్ష్మి అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమైంది.

**హైస్కూల్ ఏర్పాటు చేయండి :** తిరుపతి నగరంలోని 25వ డివిజన్‌లో ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ నరసింహాచారి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించాడు. స్కూల్‌ను అప్‌డేట్ చేసి హైస్కూల్‌గా మార్చాలని అనేకమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

### వేలిముద్రలు పడలేదని బియ్యం ఇవ్వడం లేదు



సార్! మాది దొరవారిసత్రం, ఏడింబాకం రాజుపాలెం గ్రామం. నా వయసు 50 ఏళ్లు. వేలిముద్రలు పడకపోవడం, చూపు లేకపోవడంతో ఏడు నెలలుగా రేషన్‌షాపులో బియ్యం ఇవ్వడం లేదు. వీఆర్వోను ఎన్నిసార్లు అడిగినా సమస్యను పరిష్కరించలేదు. మీరైనా కనికరించండి.

- రమణమ్మ, ఏడింబాకం రాజుపాళెం, డీవీసత్రం

### పింఛను మంజూరు చేయండి



నా భర్తకు కిడ్నీ సమస్యతో డయాలసిస్ చేస్తున్నారు. నాకు పక్షవాతంతో శరీరం సహకరించడంలేదు. నడవడానికి కూడా వీలు కావడంలేదు. కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. పింఛను కోసం తిరుగుతూనే ఉన్నా కనికరించడం లేదు. మీరైనా స్పందించండి.

- మునెమ్మ, దిగువ మల్లవరం, రేణిగుంట మండలం

# రూ.2.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

## ఏడుగురు స్మగ్లర్ల అరెస్టు


స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి-పంగూరు మెయిన్ రోడ్డులోని దొమ్మరపాళెం వద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి, 72 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. లారీ, కారును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం ఆదివారం శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. కాటూరు ఫారెస్టు బీటు పరిధిలో పంగూరు మెయిన్ రోడ్డు దొమ్మరపాళెం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున కారు, దాని వెనుక లారీ వస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించి కొద్ది దూరంలో ఆపి, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు చుట్టుముట్టి ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. లారీని పరిశీలించగా 72 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాలతో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లలో నలుగురు తిరుపతి జిల్లా, ముగ్గురు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. ఎర్రచందనం విలువ రూ.2.5 కోట్లు ఉంటుందని టాస్క్‌ఫోర్సు అధికారులు అంచనా వేశారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్ సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# రూ.52.61 లక్షల మోసం

## స్వామి మది యలగన్‌పై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పూజలు, మంత్రాలు, తిరుమలలో దుకాణాలు ఇప్పిస్తానంటూ రూ.52.61 లక్షలు మోసం చేసిన ఘటనలో స్వామి మది యలగన్‌పై పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. చెన్నైకి చెందిన స్వామి కొన్నేళ్ల కిందట కుటుంబం సహా తిరుపతికి, తర్వాత 2021లో తిరుమలకు మకాం మార్చాడు. కొండపైన ఇల్లు అద్దెకు తీసుకుని పూజలు, మంత్రాలు పేరుతో డబ్బు వసూలు చేశాడు. ఇంటి యజమానితో గొడవపడి తిరుపతి శివజ్యోతినగర్‌లోని హిల్టెన్ టవర్‌కు మకాం మార్చాడు. జాతకాలు చెప్పడం, మంత్రాలతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో తనకున్న పరిచయాలతో పనులు చేసి పెడతానంటూ డబ్బు వసూలు చేశాడు. తాను పూజారినంటూ తిరుపతికి చెందిన ఓ రిటైర్డ్ డాక్టర్‌కు ప్రాణభయం, అనారోగ్యం, ప్రమాదాల వంటి వాటి రక్షణకోసం హోమాలు, పూజలు చేస్తానని పలు విడతలుగా తన సహచరుడు రామ్ అకౌంట్‌కు రూ.52.61 లక్షలు జమ చేయించుకున్నాడు. దీనిపై సోమవారం అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా, స్వామిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాత్రిళ్లు పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దు

**● ఏనుగుల ప్రభావిత గ్రామాల్లో రైతులకు సీసీఎఫ్‌వో సూచన.. పంటల పరిశీలన**



ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'రాత్రి పూట పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దు. అక్కడ కాపలా ఉండొద్దు. ఒకటే ఏనుగు ఉందని భావించి ఒకరిద్దరు తరిమేందుకు ప్రయత్నిస్తే, పొరుగున ఉండే గుంపు వచ్చి దాడి చేసే ప్రమాదం ఉంది. పొలాల వద్ద తెల్లటి దుస్తులతో తిరగొద్దు. గున్న (పిల్లలు)లు తల్లి ఏనుగుతో ఉన్నప్పుడు తరిమేందుకు ప్రయత్నించవద్దు' అంటూ రైతులకు ఫారెస్ట్ చీఫ్ కన్సర్వేటర్ (సీసీఎఫ్‌వో) చలపతిరావు సూచించారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం సరిహద్దులో.. ఏనుగుల ప్రభావిత ప్రాంతాల్లోని పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ ఏస్టీకాలనీకి వెళ్లి వారిని అప్రమత్తం చేశారు. ఏనుగు సంచార సమాచారాన్ని ఎప్పటికప్పుడు స్థానిక సోషల్ మీడియా ద్వారా అధికారులు తెలియజేస్తారన్నారు. వదంతులను నమ్మవద్దని రైతులను కోరారు. రైతులు సమాచారమివ్వగానే రేంజ్ స్థాయి అధికారులు త్వరగా చేరుకోవాలన్నారు. ఆయన వెంట సీఎఫ్‌వో సెల్వం, తిరుపతి డీఎఫ్‌వో వివేక్, భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రెండు పంచాయతీల్లో ఏనుగుల సంచారం

ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ పరిధిలో ఇటీవల రెండు ఏనుగులను గమనించి రైతు కొండవెంకటముని భయంతో కేకలు వేయడంతో అవి మరో దారి పట్టినట్లు తెలిసింది. నెరబైలు పంచాయతీ-కూరపర్తి వారిపల్లె పంచాయతీ సరిహద్దులోని మామిడి తోటల్లో ఇవి సంచరిస్తున్నాయని సమాచారం. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టిచెర్ల, దేవరకొండ పంచాయతీల్లోనూ ఏనుగులు విడిపోయి పంటలపై దాడి చేస్తున్నాయి. మరో 15 రోజుల్లో కోతకు వస్తున్న వరి పంటకు కాపలా కాయకుంటే పందులు,దుప్పులు తిని నాశనం చేస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నాయి.. కాపలాగా వెళ్లే ఏనుగులు ప్రాణాలు తీస్తాయని భయపడుతున్నారు.

# పోలీస్ పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు


ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సీఐలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 102 మంది ఎస్పీ హర్షవర్ధనరాజుకు ఫిర్యాదు చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది సీఐలను నియమించి కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఆయా సీఐల వద్దకు వెళ్లిన ఫిర్యాదులను పరిశీలించి అదనపు ఎస్పీల వద్దకు పంపుతారు. అక్కడినుంచి నేరుగా ఎస్పీ వద్దకు పంపి సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. మరికొన్నింటిని డీఎస్పీలు, సీఐలకు పంపి పరిష్కరించాలని ఆదేశాలు జారీచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, సీఐలు సాదిక్ ఆలీ, జయచంద్ర, శ్రీరాములు, ఇమ్రాన్ భాష, రమణ, గోపి, హరిప్రసాద్, మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## వీడని ట్రాఫిక్ సమస్య


నిత్యం రద్దీగా ఉండే వెల్‌కమ్ సెంటరు రోడ్డు

నాయుడుపేట, ఏప్రిల్ 28: నాయుడుపేటలో ట్రాఫిక్ సమస్య వీడనంటోంది. నానాటికి పెరుగుతున్న పట్టణ జనాభా, తదనుగుణంగా అధికమవుతున్న వాహనాలు, ఆక్రమణలతో కుచించుకుపోతున్న రోడ్లు.. ట్రాఫిక్ సమస్యను జఠిలం చేస్తున్నాయి. గతంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి వెల్‌కమ్ సెంటరు వరకు ఆక్రమణలను తొలగించి డివైడర్లను ఏర్పాటు చేశారు. వెల్‌కమ్ సెంటరు నుంచి గాంధీ మందిరం వరకు ఆక్రమణలను తొలగించకపోడంతో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. గతంలో పోలీసులు అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీ మందిరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి ఉదయం 9నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాక్టర్లు, ఇసుక బండ్లు, లారీలు వంటి వాహనాల రాకపోకలను నియంత్రించారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉండేదికాదు. ప్రస్తుతం పట్టణంలో ఎక్కడా నిబంధనలు అమలు చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. గతంలోలా నిబంధనలు విధించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో మే 2వ తేదీన ప్రధానమంత్రి మోదీ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రకాశం జిల్లా చీరాల పట్టణంలోని సదాశివం కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర రాజధాని అమరావతిని అభివృద్ధి చేయకుండా విస్మరించిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు అమరావతి రాజధానిని అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారని, ఇందుకు శంకుస్థాపన చేయడానికి ప్రధాని మోదీని ఆహ్వానించడం జరిగిందన్నారు.

## ఆర్టీసీ కార్మికుల రిలే దీక్ష


ఆర్టీసీ డిపో వద్ద దీక్ష చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను నిలుపుదల చేయాలని, నైట్‌అవుట్ అలవెన్స్‌లను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులందరికీ పదోన్నతులు కల్పించాలని, మహిళా కండక్టర్లకు అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఇక గ్యారేజీలో సమస్యలను పరిష్కరించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. కార్యక్రమంలో మోహన్, శ్రావణ్, ప్రవీణ్, శ్రీనివాసులు, గౌస్, వెంకయ్య, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

**వెంకటగిరి టౌన్:** ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌ఎంయూఏ డిపో సెక్రటరీ కేవీ.రత్నం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద రెండు రోజులు పాటు రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు అక్రమ సస్పెన్షన్, రిమూవల్స్ నిలుపుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించడచాలన్నారు. అన్ని కేటగిరిల్లో పదోన్నతులు ఇవ్వాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. రిటైర్డు ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నైట్‌అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి రూ.400 పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీ.బాషా, ఎం.బాషా, ఇంతియాజ్, కృష్ణ, స్వామి, నరసయ్య, పెంచలయ్య, రెడ్డి, కృష్ణ బ్లాక్ స్మిత్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


లక్ష్మక్క కండ్రిగలో ర్యాలీ చేస్తున్న రైతులు

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీ లక్ష్మక్క కండ్రిగలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ జరిగింది. ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయం వల్ల ఉపయోగాలను ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ శ్రీనివాసులు, సహాయ వ్యవసాయాధికారి దినేష్, భాగ్యలక్ష్మి, పద్మమ్మ, భాగ్యమ్మ వివరించారు. సేంద్రీయ ఎరువుల వల్ల ఉపయోగాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో అధిక లాభాలు గడించి ఉత్తమ రైతులుగా ఎన్నికైన నలుగురిని శాలువాలు, జ్ఞాపికలతో అభినందించారు.

## కిరణ్‌కుమార్‌రెడ్డికి సేవారత్న అవార్డు



కిరణ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న మ్యూజికల్, ఆల్‌దిబెస్ట్ అకాడమీ ప్రతినిధులు

వాకాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నపాళెం గ్రామ ఉప సర్పంచు మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి మ్యూజికల్, ఆల్ ది బెస్ట్ అకాడమీ సంయుక్తంగా సేవారత్న పురస్కారం అందజేశాయి. సోమవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు.

## నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ చెన్నకేశవ అన్నారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో పాతనేరస్థుల నుంచి వేలి ముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీవో సరెండర్‌కు సిఫార్సు

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోట మండల ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీవో) పూర్ణిమను తిరుపతి డ్వామా కార్యాలయానికి సరెండర్ చేసుకోవాలని కోరుతూ ఎంపీడీవో గోపి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్‌కు సోమవారం మెయిల్ ద్వారా లేఖ పంపారు. ఏపీవో పూర్ణిమ గత కొద్ది రోజులుగా ఎలాంటి అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. అంతేకాకుండా ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక బహిరంగ తనిఖీ సందర్భంగా ఉపాధి పనుల్లో అవకతకవలు బయటపడడంతో డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. అలాగే ఏపీవో పూర్ణిమ నుంచి రికవరీ చేశారు.

# కొర్లగుంట గిరిజన కాలనీలో తాగునీటి ఇక్కట్లు

దొరవారిసత్రం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నేలపట్టు పంచాయతీలోని కొర్లగుంట గిరిజన కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముచ్చలగుంట నుంచి డైరెక్ట్ పంపింగ్ ద్వారా కొర్లగుంట గిరిజన కాలనీకి నీటి సరఫరా చేస్తున్నారు. అయితే నెల రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదు. దీంతో సమీపంలోని తెలుగుగంగ కాలువలోని నీటిని వాడుకొంటున్నారు. అలాగే కొర్లగుంట గిరిజన కాలనీకి నేలపట్టు పక్షుల కేంద్రం నిధులతో గతంలో మంచి నీటి పథకం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా నిర్మించిన ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. అధికారులు స్పందించి కొర్లగుంట గిరిజన కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



నీరు రాని కొళాయి - కంటచెట్ల చాటున నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

## నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్‌గా గంగోటి నాగేశ్వరరావు



దక్కిలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్‌గా దక్కిలి మండలం పలుగోడు గ్రామానికి చెందిన టీడీపీ నేత గంగోటి నాగేశ్వరరావు నియమితులయ్యారు. వ్యాపారరీత్యా చెన్నైలో స్థిరపడ్డ నాగేశ్వరరావు రెండు దశాబ్దాలుగా వెంకటగిరి నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. 2009లో వెంకటగిరి అసెంబ్లీ టికెట్ ఆశించినా టీడీపీ అదిష్టానం కురుగొండ్ల రామకృష్ణకు కేటాయించింది. 2024లో తనకు టికెట్ ఇవ్వాలని నాగేశ్వరరావు పట్టు బట్టినా మరోసారి నిరాశే ఎదురైంది. ఇటీవల యాదవ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించినా ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో గంగోటికి నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ టీడీపీ అధిష్టానానికి ప్రతిపాదించడంతో ఎట్టకేలకు నాగేశ్వరరావును ఆ పదవి వరించింది. కాగా, తనకు నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. గంగోటికి నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్ పదవి దక్కడంతో ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నోటిఫికేషన్ ఇచ్చిన భూములనూ రిజిస్ట్రేషన్ చేశారు!

సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్యవేడులో నోటిఫికేషన్ ఇచ్చిన భూములను సైతం రిజిస్ట్రేషన్ చేశారంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురువం బాబు మాట్లాడుతూ సత్యవేడు మండం రాళ్లకుప్పంలో నోటిఫికేషన్ ఇచ్చిన భూములను గుట్టుచప్పుడు కాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అదే పేదలు 5 సెంట్లు భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే సవాలక్ష ప్రశ్నలు వేసి మెలికపెట్టే అధికారులు నిబంధనలను అతిక్రమించి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. నిబంధలనకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన భూములను తక్షణమే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్జున్ గురుమూర్తి, భాస్కర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, చిరంజీవి, వేల్‌రెడ్డి, వెంకటాచలపతి, బద్దెపూడి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు


## శ్రీసిటీని సందర్శించిన జపాన్ రాయబారి



జపాన్ రాయబారికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారత్‌లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. గత నవంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇది ఆయన మొట్టమొదటి శ్రీసిటీ పర్యటన. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకహాషి మునియో, ఇతర అధికారులతో కలిసి విచ్చేసిన జపాన్ రాయబారి బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. తొలిసారి శ్రీసిటీ సందర్శనే తొలి అజెండాగా జపాన్ రాయబారి ఇక్కడకు రావడం తమకు గర్వంగా ఉందని రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. శ్రీసిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సాధించిన విజయాలు, ప్రగతిని వారికి వివరిస్తూ దేశంలోనే జపాన్ పరిశ్రమలకు రెండో అతిపెద్ద పెట్టుబడి కేంద్రంగా శ్రీసిటీ ఆవిర్భవించిందని తెలిపారు. శ్రీసిటీ అభివృద్ధి, వ్యాపార అవకాశాలకు సంబంధించిన పలు అంశాలపై జపాన్ రాయబారి ఒనో కెయిచి చర్చలు జరిపారు. జపాన్ పెట్టుబడులను ప్రోత్సహించడంలో కీలకపాత్ర వహించడంతో పాటు ఇండో - జపాన్ ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో శ్రీసిటీ చురుకైన పాత్ర పోషిస్తోందని ఆయన ప్రశంసించారు. శ్రీసిటీలోని వివిధ జపాన్ పరిశ్రమలకు చెందిన ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. శ్రీసిటీలోని వ్యాపార అనుకూల వాతావరణం, యాజమాన్య సహకారం పట్ల సంతృప్తి చేసిన జపాన్ పరిశ్రమల ప్రతినిధులు, పలు అభిప్రాయాలను, సూచనలను రాయబారితో పంచుకున్నారు. అనంతరం డైకిన్, యూనిచార్మ్ పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు ఇతర కార్యకలాపాలను పరిశీలించారు.

## లక్ష్యాల సాధనకు కష్టపడి చదవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కల్యాణ్

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ప్రతినిధి కల్యాణ్ అన్నారు. సోమవారం స్థానిక మినర్వా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు భవిష్యత్తులో తాము సాధించాల్సిన లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకుని వాటికి అనుగుణంగా ఇంటర్మీడియట్‌లో కోర్సులను తీసుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులు తాము సాధించాల్సిన విజయాలను చేరుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాము, రమణ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ చేపడుతున్న నేత్రదాన కార్యక్రమం 462కి చేరింది. సూళ్లూరుపేట పట్టణం బాపూజీ కాలనీకి చెందిన మన్నెం తులశమ్మ (74) మరణానంతరం ఆమె కుటుంబ సభ్యులు అంగీకారంతో నేత్రాలను చెన్నై శంకర నేత్రాలయకు దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం పాల్గొన్నారు.

## వాకాడులో చోరీ

వాకాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం వాకాడు అశోక్ పిల్లర్ వద్ద దుకాణంలో చోరీ చేసిన ఘటన మరువక ముందే చాకలి వీధిలో మరో చోరీ జరిగింది. ఎస్‌ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు... బాధితురాలు దువ్వూరు నరసమ్మ ఇంటికి తాళాలు వేసి శ్రీకాళహస్తిలోని తమ్ముడు వద్దకు వెళ్లింది. దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి రూ. 60వేలు, రెండు సవర్ల బంగారు వస్తువులు, 250 గ్రాములు వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

## జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

చిల్లకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో స్థానిక యువత ఆధ్వర్యంలో మత్స్యకారుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్‌యాదవ్, అదానీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేరంజన్, మత్స్యకార నాయకుడు వెంకయ్య ప్రారంభించారు. సతీష్ యాదవ్ మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారుల్లో దాగి వున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రీడాపోటీలు దోహద పడుతాయన్నారు.

## ముందుగా పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ముందస్తుగా పన్నులు చెల్లిస్తే 5శాతం రాయితీని ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే పాత బకాయిలపై 50శాతం వడ్డీ రాయితీ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈనెల 30వ తేదీ లోగా బకాయిలను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు.

## వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వెంకన్నపాళెం వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని పొన్నూరు శీనయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు... తిన్నెలపూడిలోని నారుమిట్ట కాలనీకి చెందిన శీనయ్య కోట నుంచి బైక్‌పై ఇంటికి వెళుతుండగా వెంకన్నపాళెం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తలకు తీవ్ర గాయమైన శీనయ్యను 108 వాహనంలో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## పోలేరమ్మ జాతరకు విరాళం


నెలవల సుబ్రహ్మణ్యంకు నగుదు అందజేస్తున్న శివ ప్రదీప్

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని గ్రామదేవత పోలేరమ్మ జాతరకు పగడాల శివ ప్రదీప్ శివ ప్రదీప్ రూ.50116 విరాళంగా అందజేశారు. సోమవారం రాత్రి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను కలిసి నగదు అందజేశారు. కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నానాబాల సుబ్బారావు, ధనుంజయ, గోపి, శ్యామ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, మైలాడి రాజశేఖర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోట దళితవాడకు చెందిన అరుణజ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతోంది. ఆమె వైద్య ఖర్చుల కోసం చెన్నైకు చెందిన నాగలాపురం గిరిధర్‌రెడ్డి రూ.10వేలు వితరణ చేశారు. ఆ చెక్కును స్థానిక షిరిడి సాయి అక్షయసేవా సమితి కన్వీనర్ అల్లం రమణయ్య అరుణజ్యోతి తండ్రి వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

డక్కిలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. డక్కిలి సర్వే నెంబరు 258లోని ప్రభుత్వ భూమి ఆక్రమణ నేపథ్యంలో సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

## సంక్షేమ పథకాలను విస్తరింపజేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం అనీల

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకు విస్తరింపజేయాలని వెలుగు ఏపీఎం అనీల కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వీవోఏలు, సంఘబంధ అధ్యక్షురాళ్ల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అనీల మాట్లాడుతూ మండలంలోని పలు సంఘబంధాల పరిధిలో ఉన్న పొదుపు సంఘాలు రుణాల రికవరీలో వెనుకబడి ఉన్నాయన్నారు. వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. అంతేకాకుండా కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీసీలు ప్రసాద్, భాస్కర్, శంకర్, అలివేలమ్మ, శ్రీకాంత్, బిందు తదితరులు పాల్గొన్నారు.

## కోట బార్ అసోసియేషన్ ఎన్నిక


బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని అభినందిస్తున్న న్యాయవాదులు

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో సోమవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షుడుగా అత్తికాయల మోహన్, జనరల్ సెక్రటరీగా పీవీ రమణ, కోశాధికారిగా ఆర్.కాటయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎంజసూర్య, పిజసాగర్, సెక్రటరీగా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కమిటీని న్యాయమూర్తి భరత్ కమల్ అభినందించారు. ఎన్నికల అధికారిగా రామచంద్రరావు వ్యవహరించారు.

## విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాసులురెడ్డి, ఎన్‌పీఆర్డీ అధ్యక్షురాలు శాంతకుమారి, ఉపాధ్యాయుడు ఉస్మాన్ భాషా

సూళ్లూరుపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట భవిత కేంద్రంలోని విద్యార్థులు డి.హారిక, పి.శ్రీనివాసులు, డి.మునిశేఖర్ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరచడంతో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎన్‌పీఆర్డీ అధ్యక్షురాలు శాంతకుమారి, ఉపాధ్యాయుడు ఉస్మాన్ భాషా సహకారంతో ఎంఈవో శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు బహుమతులు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయురాలు భార్గవి, కుమారి, కనకమ్మ పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం

పెళ్లకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడం సీఎం చంద్రబాబునాయుడుకే సాధ్యమైందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొత్తూరు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిలో ఎన్నో ఒడుదిడుకులు ఎదుర్కొంటూ సూపర్ సిక్స్ పథకాలను ప్రాధాన్య క్రమంలో అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, మురళీనాయుడు, కృష్ణమనాయుడు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతో సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని రామాపురం వైద్యాధికారిణి జయశ్రీదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వేనాడు పంచాయతీ మూల గ్రామంలో లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో కొందరు జ్వరపీడితులు ఉండడంతో వారినుంచి రక్తనమూనాలను సేకరించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజకుమారి, సిబ్బంది రమేష్, శివరంజనీ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

## శంకర జయంతి వేడుకలు

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్ణకమ్మ వీధిలోని జగద్గురు ఆది శంకరాచార్య మఠంలో సోమవారం నుంచి శంకర జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విభూతి, చందన, పుష్పాలంకరణ చేశారు. అవ్వారు శ్రీనివాసులు బృందం ఆధ్వర్యంలో నామసంకీర్తన నిర్వహించారు.



## పక్క పొలంవారి నుంచి కాపాడండి

### పోలీసులకు ఒంటరి మహిళ ఫిర్యాదు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళ అయిన తనను కొంత భూమిని వదులుకోవాలంటూ పక్కపొలం వారు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు తెలిపిన వివరాలు... తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన భువనేశ్వరికి సర్వే నెం.356/3లో 1.40ఎకరాల భూమి ఉంది. ఇటీవల గ్రామంలో రీసర్వే ప్రక్రియ ప్రారంభమైంది. 22 సంవత్సరాలుగా ఆ భూమిని భువనేశ్వరి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇటీవల తన పక్కన ఉన్న పొలంలో కొలతలు తగ్గాయి. అలాగే భువనేశ్వరికి మరో వైపున ఉన్న ఇతరుల భూమిలో అదనంగా వచ్చింది. అయితే మధ్యలో కొలత ప్రకారం సరిగ్గా ఉన్న భువనేశ్వరిని భూమిని వదులుకోవాల్సిందిగా రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేశారని చెబుతోంది. ఈ క్రమంలో సోమవారం తన పక్క పొలం వారు కొంత భూమిని వదులుకోవాలని ఇంటికి వచ్చి భయభ్రాంతులకు గురిచేసినట్టు తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## పదోన్నతులు కల్పించాలి: ఎన్‌ఎంయూఏ



రిలే దీక్ష చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

సత్యవేడు, ఏప్రిల్ 28: ఆర్టీసీలో గత నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ అధ్యక్షుడు పెరుమాళ్ డిమాండ్ చేశారు. ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సత్యవేడు డిపో ఎదుట యూనియన్ నాయకులు రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పెరుమాళ్ మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం ప్రవేశపెట్టిన జీవో నెం.1ని అమలు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని కోరారు. అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు ఓడీలు కేటాయించాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్‌ఎంయూఏ డిపో అధ్యక్షుడు పార్థసారథి రెడ్డి, గ్యారేజీ అధ్యక్షుడు కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని నిర్మాణాలను తొలగించండి



ఆలయ ట్రస్ట్ సభ్యులకు నోటీసులు అందిస్తున్న పంచాయతీ అధికారులు

నారాయణవనం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొరకాయల స్వామి అన్నదానం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న అనుమతి లేని కట్టడాలను తొలగించాలని పంచాయతీ అధికారులు సోమవారం నోటీసులు ఇచ్చారు. ఈవోపీఆర్డీ వేణయ్య, ఈవో షణ్ముగం మీడియాతో మాట్లాడుతూ సొరకాయల స్వామి ఆలయ ట్రస్ట్ సాగిస్తున్న నిర్మాణాలు, పన్నులు, అనుమతులు వివరాలు కోరుతూ జడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ సమాచార హక్కు చట్టం కింద అర్జీ దాఖలు చేశారని తెలిపారు. ఈ మేరకు సొరకాయల స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న నిర్మాణాలు, వాణిజ్య సముదాయల నిర్మాణాలకు పంచాయతీ నుంచి అనుమతులు తీసుకోలేదన్నారు. పన్నులు కూడా నామమాత్రంగా చెల్లిస్తున్నారని తెలిపారు. అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండస్తుల భవనాన్ని తుడా, పంచాయతీ నుంచి అనుమతులు లేకుండానే నిర్మిస్తున్నారన్నారు. ఈ అనుమతి లేని నిర్మాణాలను వారం రోజుల్లో తొలగించకుంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామంటూ నోటీసులు జారీ చేశారు.

### ఇంటి స్థలాల కోసం

## తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



తహసీల్దార్ కార్యాలయం ముట్టడిలో కనమనంబేడువాసులు

సత్యవేడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనం బేడు గ్రామ దళితులకు ఇంటి స్థలాల కోసం జిల్లా సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు చిన్నిరాజ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా చిన్నిరాజ్ మాట్లాడుతూ... కనమనంబేడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.252, 253, 254 లలో ప్రభుత్వ భూమిలో పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు సిబ్బందితో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. అనంతరం గ్రామస్తులు తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు.

● మండలంలోని కల్లివెట్టులో బీసీలకు సంబంధించిన ఇంటి స్థలాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ శ్రీదేవికి గ్రామస్తులు వినతిపత్రం అందించారు.

## సమయపాలన పాటించని అధికారులు

### ఇబ్బంది పడుతున్న అర్జీదారులు

కేవీబీపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో ఆయన కార్యాలయం ఖాళీగా దర్శనమిచ్చింది. సోమవారం ప్రజలు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే ఈ కార్యక్రమానికి కూడా అధికారులు హాజరు కాకపోవడంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కనీసం గ్రీవెన్స్‌డే రోజు అయిన విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఒక వేళ ప్రధాన అధికారులు రాకపోయినా వారి స్థానంలో వేరేవారిని నియమించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా కన్పిస్తున్న ఎంపీడీవో చాంబర్

## పుత్తూరు వార్తలు

## మూలనపడ్డ సిటిజన్ చార్టర్



పుత్తూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల్లో సేవలు, ప్రమాణాలు, సమయపాలన, ఫిర్యాదుల పరిష్కార విధానాలతో పాటు పారదర్శకత, జవాబు దారీతనాన్ని సిటిజన్స్ చార్టర్ సూచిస్తుంది. కాగా, పుత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సిటిజన్స్ చార్టర్ నిర్లక్ష్యానికి గురవుతోంది. కార్యాలయానికి వచ్చే ప్రజలకు గుమ్మానికి ఎదురుగా మిద్దెపైకి ఎవరూ వెళ్లకుండా మెట్ల మార్గానికి అడ్డుగా పెట్టిన దృశ్యం కనిపిస్తుంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సిటిజన్స్ చార్టర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాల్సి ఉంది.

## డిమాండ్ల సాధనకు ఎన్‌ఎంయూఏ దీక్ష



రిలే దీక్షలో ఎన్‌ఎంయూఏ నాయకులు

పుత్తూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆర్టీసీ కార్మికులు రిలే దీక్ష చేపట్టారు. పుత్తూరు ఆర్టీసీ గ్యారేజీ వద్ద ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో జరిగిన దీక్ష సందర్భంగా యూనియన్ డిపో కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ... గత కొన్ని రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. మలిదశ పోరాటంలో భాగంగా రిలే దీక్ష చేపట్టామన్నారు. నాయకులు కుమార్, సుందరం, శివకుమార్, దొరబాబు, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని ఈనెల 29న మంగళవారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయాన్ని ఉదయం 7 గంటల నుంచి లెక్కించనున్నట్లు తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు.

# ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరత తీర్చండి

### కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సత్యవేడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరతను తీర్చాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్లును కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు హేమభూషణం, ధనేష్, శోభ, చిన్నా తదితరులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ.. జిల్లాకు మారుమూలగా తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న సత్యవేడులో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో గైన కాలజిస్ట్, అనస్థీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌ను పుత్తూరుకు బదిలీ చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా గత మూడు నెలలుగా ఖాళీగా ఉన్న సత్యవేడు తహసీల్దార్ పోస్టును భర్తీ చేసి, రెవెన్యూ సమస్యల పరిష్కరించాలని కోరారు. టీటీడీ కల్యాణ మండపం నిర్మాణ పనులు, నాగలాపురం - చిన్నపాండూరు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించేలా చొరవ తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కరిస్తానని చెప్పారు.

## పట్టు వస్త్రాల సమర్పణ

రేణిగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలోని మర్రిమంద గ్రామంలో లక్ష్మీ హయగ్రీవ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే సుధీర్ పాల్గొని స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ నిర్మాతలను అభినందించారు.

## బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు, సోమవారం మండలంలోని నెలవాయి, వేణుగోపాలపురంలలోని గిరిజన కాలనీల్లో బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏర్పేడు సీఐగా శ్రీకాంత్ రెడ్డి



రేణిగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సీఐగా శ్రీకాంత్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఏర్పేడులో సీఐగా పనిచేస్తున్న జయచంద్ర బదిలీపై రేణిగుంట అర్బన్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న శ్రీకాంత్ రెడ్డి బదిలీపై ఏర్పేడుకు వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ రెడ్డికి పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## యోగాతో జ్ఞాపకశక్తి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోజూ యోగా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు. రామకృష్ణ మిషన్‌లో సోమవారం వేసవి శిక్షణ శిబిరం (సంస్కార శిబిరం) ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో శిక్షణ వల్ల వ్యక్తిత్వ వికాసం పొందవచ్చన్నారు. భారతీయ విద్యాభవన్, శ్రీవేంకటేశ్వర విద్యాలయం డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విలువలు అందించాలని రామకృష్ణమిషన్ ప్రయత్నిస్తోందన్నారు. ఇక్కడ లభించే పుస్తకాలు చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సుకృతానంద పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించి నిరసన

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రతతో పాటు న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పీలు విధులు బహిష్కరించి సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు నిరసనకు దిగారు. సమస్యల పరిష్కారం కోసం వారు పది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న విషయం విదితమే. ప్రభుత్వం స్పందించకపోవడంతో విధులు బహిష్కరించి, సమ్మెబాట పట్టారు. ఎంఎల్‌హెచ్‌పీల అసోసియేషన్ నేతలు మేరీకృప, సుమంత్ పాల్గొన్నారు.

## పుస్తక పఠనాన్ని అలవరచుకోండి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అందరూ పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని తిరుపతి ఉప విద్యాశాఖాధికారి కె.బాలాజీ పిలుపునిచ్చారు. అన్నమయ్య కూడలి సమీపంలోని గ్రేడ్-1 గ్రంథాలయంలో వేసవి ఉచిత విజ్ఞాన తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. చినిగిన చొక్కా అయినా తొడుక్కో... మంచి పుస్తకం కొనుక్కో అన్న కందుకూరి వీరేశలింగం పంతులు మాటలను గుర్తు చేశారు. గ్రంథాలయ శాఖ ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను నిర్వహించడం చాలా ఉపయుక్తమన్నారు. ముఖ్య అతిథులు ఇంపాక్ట్ ట్రైనర్ నడ్డి నారాయణ, ఉయ్ సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసున్నిసా బేగం మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని వివరించారు. కార్యక్రమంలో ఎస్వీయూ విశ్రాంత అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్, గాయకులు సోము ఉమాపతి, విశ్రాంత ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత జనరల్ మేనేజర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



శిక్షణకు హాజరైన మహిళలతో ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు పహల్గాం ఉగ్రదాడి ఘటనలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇల్లు బాగుపడాలంటే ఆ ఇంట్లో మహిళ ఆర్థికంగా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ ఉద్దేశంతో సీఎం చంద్రబాబు మహిళల కోసం అనేక పథకాలను తీసుకువస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే ఉచిత టైలరింగ్ శిక్షణ అన్నారు. దీని ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని చెప్పారు. శ్రీకాళహస్తిలో ప్రస్తుతానికి 600 కుట్టు మెషిన్లు ఇచ్చామన్నారు. పురపాలకసంఘ కమిషనర్ గిరికుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మామండూరులో ఏనుగుల బీభత్సం



మామిడి చెట్లను విరిచేసిన ఏనుగులు

రేణిగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామండూరులో ఏనుగుల మంద మామిడి తోటల్లో బీభత్సం సృష్టించింది. సుమారు 40 ఎకరాల్లో చెట్ల కొమ్మలను, పిందెలను విరిచి వేసినట్టు తోట యజమానులు వాపోతున్నారు. వారం రోజులుగా ఏనుగులు వచ్చే సమయంలో బాణసంచా కాల్చడంతో అవి అడవిలోకి వెళ్లిపోయాయని చెప్పారు. ఆది వారం సాయంత్రం రైల్వే ట్రాక్‌ను దాటుకొని మూడు ఏనుగులు తోటలోకి ప్రవేశించి బీభత్సం సృష్టించడంతో బాణసంచా కాల్చామ న్నారు. దీంతో అవి అడవిలోకి వెళ్లిపోయా యన్నారు. ప్రతి రోజు సాయంత్రం వేళల్లో తోటల్లోకి ప్రవేశించి పంటను ధ్వంసం చేస్తున్నాయన్నారు. ఫిర్యాదు చేస్తే అటవీ శాఖ అధికారులు తోటల్ని పరిశీలించి ఫొటోలు తీసుకొని వెళ్తున్నారే చిల్లిగవ్వ పరిహారం చెల్లించలేదన్నారు. అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు రాకుండా తవ్విన కందకాలు పూడిపోయాయని వాటిని లోతుగా తవ్వాలని తోట యజమానులు కోరుతున్నారు.

## మా ఫ్లెక్సీలనే ఎందుకు తొలగించారు: జనసేన

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రమే ఎందుకు తొలగించారంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈనెల 25న వినుత జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణవ్యాప్తంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పలుచోట్ల ట్రాఫిక్‌కు ఫ్లెక్సీలు అంతరాయంగా ఉన్నాయంటూ పోలీసులు సూచించారంటూ పురపాలకసంఘ సిబ్బంది సోమవారం సుమారు 80 ఫ్లెక్సీలను తీసివేశారు. దీంతో వినుత నాయకులతో కలిసి సాయంత్రం పురపాలకసంఘ కార్యాలయానికి చేరుకుని కమిషనర్ గిరికుమార్‌ను కలిసి జనసేన బ్యానర్లను మాత్రమే ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. పట్టణంలో ఎక్కడెక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఫ్లెక్సీలు ఉన్నాయో చూపుతామంటూ జనసేన నాయకులు అధికారులకు చెప్పారు. దాంతో కమిషనర్ సిబ్బందితో బీపీ అగ్రహారం కూడలికి చేరుకున్నారు. అక్కడ ఇతర పార్టీల ఫ్లెక్సీలు తొలగించకపోవడంపై వాగ్వాదం జరిగింది. ఇతర ఫ్లెక్సీలను కూడా తొలగించడంతో జనసేన నేతలు శాంతించారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నాగలాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరకుప్పం జడ్పీ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఇరవై ఏళ్ల తరువాత కలుసుకున్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీ కలయిక కార్యక్రమంలో 2002 - 03 టెన్త్ విద్యార్థులు కలుసుకుని తమకు పాఠాలు, జీవిత విలువలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, ఆశీస్సులు అందుకున్నారు. ఆత్మీయ కలయిక సందర్భంగా తాము చదివిన పాఠశాలకు చేయూతనందించి, అభివృద్ధికి బాసటగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అతిగా మద్యం తాగి ట్యాక్సీ డ్రైవర్ మృతి

రేణిగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ట్యాక్సీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన తారకరామానగర్‌లో సోమవారం జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు... తిరుపతి నగరం మంగళానికి చెందిన మురళీధరన్ (64) ట్యాక్సీ డ్రైవర్. తారకరామానగర్‌కు చెందిన ఆచారితో కలిసి ఆదివారం రాత్రి తిరుపతిలో మద్యం తాగాడు. ఆచారితో ఆయన ఇంటికి చేరుకుని అక్కడే నిద్రపోయాడు. అయితే తన బంధువు మంగళంలో మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనడానికి ఆచారి వెళ్లాడు. కార్యక్రమాల అనంతరం ఆచారి ఇంటికి చేరుకున్నాడు. అయితే మంచంపై పడుకున్న మురళీధరన్ మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. వెంటనే ఆయన భార్య శాంతికి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## వేదోక్తంగా మృత్యుంజయుడి పూజలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులిచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు, మహా మంగళ హారతులు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

## 7నుంచి చెన్నకేశవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను మే 7 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోండి

### విద్యార్థులకు ఎమ్మెల్యే పిలుపు



విద్యార్థులతో ఎమ్మెల్యే సుధీర్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తోందన్నారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సోమవారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. అందులో భాగంగా విద్యార్థులకు కథలు వినడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం తదితరాలపై గ్రంథాలయ అధికారులు శిక్షణ ఇచ్చారు. కాగా ఈ కార్యక్రమం జూన్ 6వ తేదీ వరకు జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.